


డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR




| తెలంగాణ Telangana | సోమవారం Monday | 22- 06 -2026 22- 06 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 158 Issue: 158 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## విద్యార్థుల కోసం మోదీ నిరీక్షణ

నీట్ పరీక్షకు ఆటంకం కలగకుండా నిర్ణయం.
45 నిమిషాలపాటు విమానాశ్రయంలోనే ప్రధాని.
విద్యార్థుల ప్రయోజనాలకే ప్రాధాన్యం.


2 లో..

## ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో అగ్ని ప్రమాదం



ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం.
సాంకేతిక లోపంతో చెలరేగిన మంటలు.
సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు.
2

## మూసీ విధ్వంసంపై కేటీఆర్ ఫైర్

రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం.
కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు.
కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామన్న కేటీఆర్.


02



## యోగ భారతీయ సంస్కృతికి అమూల్యమైన కానుక

జబల్‌పూర్‌లో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ద్రౌపది ముర్ము.
ప్రపంచవ్యాప్తంగా యోగా సాధకులకు శుభాకాంక్షలు.
ఆరోగ్యకర జీవనానికి యోగ మార్గదర్శి.


2 లో..

## సింగరేణి బొగ్గు చోరీ ఆరోపణలు నిరాధారం

అత్యాధునిక సాంకేతికతతో బొగ్గు రవాణా పర్యవేక్షణ.
ప్రతి టన్ను బొగ్గుపై నిరంతర నిఘా.
స్పష్టత ఇచ్చిన సింగరేణి యాజమాన్యం.


02

## నీట్ విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం

హర్షం వ్యక్తం చేసిన పొన్నం.
ప్రభుత్వ నిర్ణయంపై సానుకూల స్పందన.
విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న మంత్రి.



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 21:**
రీ-నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు వినియోగించుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి విశేష స్పందన లభించిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్లిన విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. దీనివల్ల విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసే అవకాశం లభించిందన్నారు. నీట్ పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మిగతా 2 లో...

## అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులతో కిషన్ రెడ్డి భేటీ

'విశేష్ సంపర్క్ అభియాన్'లో భాగంగా సమావేశం.
మోదీ పాలన విజయాలను వివరించిన కిషన్ రెడ్డి.
ఆరోగ్య రంగ అభివృద్ధిపై చర్చలు.

02


## యోగంతో నే సుఖీభవ ఆంధ్రప్రదేశ్: చంద్రబాబు


2

రాష్ట్రవ్యాప్తంగా యోగా చైతన్యానికి కొత్త ఊపు.
విజయవాడలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు.
బాబా రామ్‌దేవ్‌తో కలిసి యోగాభ్యాసం చేసిన సీఎం.
ప్రతి ఇంటికీ యోగా చేర్చడమే లక్ష్యమన్న ప్రభుత్వం.



## హనుమాన్ నగర్ ప్రజలకు కేటీఆర్ భరోసా

'బస్తీ బాట' కార్యక్రమంలో స్థానికులతో ముఖాముఖి.
భూ స్వాధీనంపై ప్రభుత్వంపై విమర్శలు.
బస్తీవాసులకు అండగా ఉంటామన్న కేటీఆర్.
02

# విద్యార్థుల కోసం మోదీ నిరీక్షణ

**జనం వాయిస్, న్యూఢిల్లీ, జూన్ 21:**
విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక పరీక్ష సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు. కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన వెంటనే తన అధికారిక నివాసానికి వెళ్లకుండా అక్కడే నిరీక్షించారు. సాధారణంగా ప్రధాని ప్రయాణాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించడం వంటి చర్యలు చేపడతారు. అయితే అదే సమయంలో దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష జరుగుతుండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే వేళ ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదని భావించినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 1.15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని సుమారు 45 నిమిషాలపాటు అక్కడే ఉన్నారు. నీట్ పరీక్ష ప్రారంభ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో తన కాన్వాయ్ ప్రయాణం వల్ల ట్రాఫిక్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు సూచించినట్లు సమాచారం. దీంతో పరీక్ష రాసే విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. నీట్ పరీక్ష దేశంలోని అత్యంత కీలక ప్రవేశ పరీక్షల్లో ఒకటి. వైద్య విద్యలో ప్రవేశాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాల్సి ఉండటంతో రహదారులపై చిన్న అంతరాయం కూడా అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని ప్రధాని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన తర్వాత మాత్రమే ప్రధాని విమానాశ్రయం నుంచి బయల్దేరి తన అధికారిక నివాసానికి వెళ్లారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో వారికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించిన ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా స్పందనలు వ్యక్తమవుతున్నాయి.



# యోగ భారతీయ సంస్కృతికి అమూల్యమైన కానుక

**జనం వాయిస్, జబల్‌పూర్, జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన సామూహిక యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశాల్లోని యోగా సాధకులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్రపతి, మానవాళికి ఆరోగ్యకరమైన, సమతుల్యమైన, అర్థవంతమైన జీవితాన్ని చూపించిన భారతదేశపు గొప్ప సంప్రదాయాన్ని నేడు ప్రపంచం గౌరవిస్తోందని అన్నారు. యోగ అనేది భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక వికాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్రపతి వివరించారు. వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడులు, అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో యోగ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో యోగకు పెరుగుతున్న ఆదరణ భారతీయ జ్ఞాన సంపద గొప్పతనానికి నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలను యోగ ఒకే వేదికపైకి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగ" అనే ప్రధాన అంశంతో నిర్వహించడం ఎంతో సముచితమని రాష్ట్రపతి అన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగ సాధన ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని సూచించారు. యోగను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చిన రాష్ట్రపతి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని పేర్కొన్నారు. యోగ ద్వారా శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యోగా సాధకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



# మూసీ విధ్వంసంపై కేటీఆర్ ఫైర్

**జనం వాయిస్, రాజేంద్రనగర్, జూన్ 21:**
రాజేంద్రనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, కాంగ్రెస్, బీజేపీల వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మూసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసకర రాజకీయాలు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గాంధీ పేరును ప్రస్తావిస్తూ పేదల ఇళ్లను కూల్చడం సరైన చర్య కాదన్నారు. గాంధీపై నిజమైన గౌరవం ఉంటే పేదలకు న్యాయం చేయాలని, వారి నివాసాలను కాపాడాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పేదల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. స్థానిక బీజేపీ నేతలు ఒకలా మాట్లాడుతున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు నిధులు లేవని చెబుతూనే మూసీ ప్రాజెక్టు కోసం భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేయడానికి సిద్ధమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాలపై కూడా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన నాయకులు పార్టీ మారినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోయినప్పటికీ బీఆర్ఎస్ బలహీనపడలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. గులాబీ సైన్యం రాష్ట్రవ్యాప్తంగా బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో అగ్ని ప్రమాదం

**జనం వాయిస్, కరీంనగర్, జూన్ 21:**
కరీంనగర్-2 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న సమయంలో తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ సమీపంలో ఈ ఘటన జరిగింది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బస్సులో సాంకేతిక లోపం ఏర్పడటంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక భాగం నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపివేశారు. పరిస్థితిని అంచనా వేసిన సిబ్బంది ప్రయాణికులను అప్రమత్తం చేశారు. డ్రైవర్, కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ



వెంటనే కిందికి దించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు, ప్రయాణికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అనంతరం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన కారణంగా కొంతసేపు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని చక్కదిద్దారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు వివరాలను సేకరించారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఎలక్ట్రిక్ బస్సులోని బ్యాటరీ వ్యవస్థలో లోపమా లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశంగా నిలిచింది.

# సింగరేణి బొగ్గు చోరీ ఆరోపణలు నిరాధారం

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 21:**
సింగరేణి బొగ్గు చోరీకి గురైందని, భారీగా బొగ్గు మాయమైందంటూ కొన్ని మాధ్యమాల్లో వస్తున్న కథనాల్లో ఎలాంటి నిజం లేదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారులకు సరఫరా చేసే వరకు ప్రతి దశను అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. సింగరేణి కార్యకలాపాల విభాగం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి తుది వినియోగదారునికి చేరే వరకు ప్రతి ప్రక్రియ డిజిటల్ విధానంలో నమోదు అవుతోంది. సుమారు 85 శాతం బొగ్గు రైల్వే మార్గంలో, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు, గనులు, పరిమాణం, సరఫరా షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలన్నీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వ్యవస్థల్లో ముందుగానే నమోదు అవుతున్నాయని తెలిపారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ తూనిక కేంద్రాల వద్ద కచ్చితంగా తూకం వేస్తున్నట్లు ప్రణాళిక విభాగం అధికారులు వివరించారు. వాహనాల కదలికలను ఆర్ఎఫ్ఐడీ ఆధారిత గేట్లు, జీపీఎస్, జీపీఆర్ఎస్ పరికరాలు, భౌగోళిక పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా నిరంతరం గమనిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశిత మార్గం నుంచి వాహనం పక్కదారి పట్టినా వెంటనే గుర్తించే సదుపాయం అందుబాటులో ఉందన్నారు. రైల్వే మార్గంలో బొగ్గు రవాణా విషయంలో కూడా ప్రతి వ్యాగన్‌కు సంబంధించిన లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్ విధానంలో నమోదు అవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. గనులు, బొగ్గు నిర్వహణ కేంద్రాలు, తూనిక కేంద్రాలు, రైల్వే సైడింగ్‌లు, నిల్వ కేంద్రాలు, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, భద్రతా సిబ్బంది నిరంతర నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. అదనంగా ప్రత్యేక తనిఖీలు, ఆకస్మిక దాడులు, భద్రతా బృందాల గస్తీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాలకు సంబంధించి ప్రతి ప్రక్రియపై బహుళ స్థాయి భద్రతా వ్యవస్థ అమలులో ఉందని స్పష్టం చేసింది. ఆర్ఎఫ్ఐడీ, జీపీఎస్, సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ తూనిక కేంద్రాలు, భద్రతా సిబ్బంది, ప్రత్యేక దళాలు, హోలోగ్రామ్ చలానాలు వంటి పలు భద్రతా వ్యవస్థల పర్యవేక్షణలోనే బొగ్గు రవాణా జరుగుతోందని యాజమాన్యం పేర్కొంది. ఈ నేపథ్యంలో సింగరేణి బొగ్గు చోరీకి గురైందని లేదా భారీగా మాయమైందని వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది.

# నీట్ విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం

**- మొదటిపేజీ తరువాయి...**
నాయకత్వంలో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అన్నారు. విద్య, ఉపాధి, పోటీ పరీక్షల విషయంలో విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉచిత ప్రయాణ సౌకర్యంపై



విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు పరీక్షల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమ పాలనలో భాగంగా విద్యార్థుల అభ్యున్నతికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# హనుమాన్ నగర్ ప్రజలకు కేటీఆర్ భరోసా

**జనం వాయిస్, రాజేంద్రనగర్, జూన్ 21:**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్ బస్తీలో నిర్వహించిన 'బస్తీ బాట' కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు తమకు ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వారికి పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న తమను బలవంతంగా తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు కేటీఆర్‌కు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను కూడా రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నివాస హక్కులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఇళ్లపై దృష్టి పెట్టిందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హనుమాన్ నగర్ బస్తీ మూసీ నది పరిధికి చాలా దూరంలో ఉన్నప్పటికీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలు ఐక్యంగా ఉంటే తమ హక్కులను కాపాడుకోవచ్చని సూచించారు. బస్తీవాసులు ఎవరూ భయపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీల అమలులో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంపై కాకుండా ఇతర అంశాలపై దృష్టి సారిస్తోందన్నారు. భూములు, ఇళ్ల సమస్యల విషయంలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం జరుగుతోందని ఆరోపించారు. మరో సంవత్సరం ఓపిక పట్టాలని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీస్సులతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హనుమాన్ నగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పట్టాలు అందించే బాధ్యత తమదేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులతో కిషన్ రెడ్డి భేటీ

**జనం వాయిస్, చెన్నై, జూన్ 21:**
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి 'విశేష్ సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైలో అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులు పి. విజయ్ కుమార్ రెడ్డి, ప్రీతా రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే ప్రత్యేక పుస్తకాన్ని వారికి అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి ఈ పుస్తకంలో వివరించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. దేశ అభివృద్ధిలో వివిధ రంగాల్లో నమోదైన పురోగతిని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. దేశ ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణ, వైద్య సేవల అందుబాటు, ఆధునిక వైద్య సాంకేతికత వినియోగం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ భేటీ ఎంతో ఆహ్లాదకరంగా సాగిందని కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమాల వేదికగా పేర్కొన్నారు. పరస్పర అభిప్రాయాల మార్పిడి, వివిధ అంశాలపై ఆలోచనాత్మక చర్చలు, విలువైన సూచనలు ఈ సమావేశంలో చోటుచేసుకున్నాయని వెల్లడించారు. వైద్య రంగంలో అపోలో ఆసుపత్రుల పాత్ర, దేశ ఆరోగ్య వ్యవస్థలో ప్రైవేటు రంగం భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. 'విశేష్ సంపర్క్ అభియాన్' కార్యక్రమం ద్వారా వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వైద్య నిపుణులు, సామాజిక సేవకులను కలిసి కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.



# యోగంతోనే సుఖీభవ ఆంధ్రప్రదేశ్: చంద్రబాబు








**జనం వాయిస్, విజయవాడ, జూన్ 21:**
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత శక్తివంతమైన సాధనమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన భారీ యోగా కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి పాల్గొన్నారు. వేలాది మంది యోగా సాధకుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక, ఆరోగ్య చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో మాట్లాడిన చంద్రబాబు, యోగాకు ప్రపంచవ్యాప్తంగా అపూర్వ గుర్తింపు రావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి ఎంతో గొప్పదని అన్నారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ప్రపంచ వేదికపై నిలబెట్టి, దాదాపు 190 దేశాలు యోగా దినోత్సవాన్ని జరుపుకునేలా చేసినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధ్యాత్మికత, సాంకేతికత రెండూ కలిసినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం ద్వారా మనిషి శారీరకంగా దృఢంగా, మానసికంగా ప్రశాంతంగా ఉండగలడని చెప్పారు. ఆరోగ్యవంతమైన, సంపన్నమైన, ఆనందభరితమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత ఏడాది విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని గుర్తుచేసిన సీఎం, వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను తిరుపతిలో మరింత వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. యోగాను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాల్లో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో యోగా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. జిల్లా, మండల స్థాయిల్లో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించే అధికారులను నియమిస్తామని, యోగా ప్రమాణాలను రూపొందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. 'యోగాంధ్ర' పేరుతో ప్రత్యేక డిజిటల్ వేదికను ప్రారంభించి యోగా సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ, వార్డు స్థాయి కార్యాలయాల్లో శాశ్వత యోగా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి సహజ ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఆగస్టు 15న 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని వెల్లడించారు. ప్రతి వ్యక్తి రోజుకు కనీసం గంటసేపు యోగా, ధ్యానం, ప్రాణాయామానికి కేటాయిస్తే ఆసుపత్రుల అవసరం గణనీయంగా తగ్గుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం వ్యసన నిర్మూలన ప్రచార యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

దినపత్రిక జనం వాయిస్
RNI NO:TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# సంపాదకీయం

## సంతానానికి ఆరోగ్యమే పునాది

### ఆహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యకరమైన కుటుంబ జీవితం

**జనం వాయిస్, డెస్క్, జూన్ 21:**

ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లలో మార్పులు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు సహజంగా జరిగే ప్రక్రియగా భావించిన సంతానోత్పత్తి నేడు అనేక కుటుంబాలకు సవాలుగా మారుతోంది. దీనికి ప్రధాన కారణాల్లో అనారోగ్యకరమైన జీవనశైలి కూడా ఒకటిగా కనిపిస్తోంది. అందుకే సంతానం కోసం ప్రయత్నించే దంపతులు ముందుగా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.సంతానోత్పత్తి సామర్థ్యం కేవలం మహిళ ఆరోగ్యంపై మాత్రమే ఆధారపడదు. భార్యాభర్తలు ఇద్దరి ఆరోగ్యం కూడా సమానంగా ప్రభావం చూపుతుంది. సరైన పోషకాహారం, క్రమబద్ధమైన జీవనశైలి, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత వంటి అంశాలు సంతానోత్పత్తి అవకాశాలను మెరుగుపరుస్తాయి. ఆరోగ్యకరమైన శరీరమే ఆరోగ్యకరమైన తరానికి పునాది అవుతుంది.రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తప్పనిసరిగా ఉండాలి. వీటిలో లభించే విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు శరీరానికి అవసరమైన పోషణను అందిస్తాయి. ముఖ్యంగా దానిమ్మ, బత్తాయి, నారింజ, బొప్పాయి,



క్యారెట్, బీట్‌రూట్ వంటి ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సహజ ఆహారం తీసుకోవడం వల్ల శరీర వ్యవస్థలు సమర్థంగా పనిచేస్తాయి.పప్పుధాన్యాలు, పాలు, పెరుగు, గుడ్లు, చేపలు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు కూడా తీసుకోవాలి. ఇవి శరీర కణాల నిర్మాణానికి, పునరుత్పత్తి వ్యవస్థ పనితీరుకు అవసరమైన శక్తిని అందిస్తాయి. బాదం, అక్రోట్, నల్ల నువ్వులు, గుమ్మడి గింజలు వంటి ఆహారాలు కూడా మంచి పోషక వనరులుగా గుర్తించబడ్డాయి.

శరీర బరువు కూడా సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతుంది. అధిక బరువు లేదా చాలా తక్కువ బరువు ఉన్న వారిలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందువల్ల సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం అవసరం. దీనివల్ల శరీరంలోని వివిధ వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తాయి.వ్యాయామం శరీరాన్ని చురుకుగా ఉంచడమే కాకుండా రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. ప్రతిరోజూ నడక, పరుగు, సైక్లింగ్, యోగా వంటి వ్యాయామాలు చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.నేటి కాలంలో మానసిక ఒత్తిడి పెద్ద సమస్యగా మారింది. ఉద్యోగ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలు అనేక మందిని మానసికంగా ప్రభావితం చేస్తున్నాయి. అధిక ఒత్తిడి హార్మోన్ల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల ధ్యానం, యోగా, పుస్తక పఠనం, సంగీతం వినడం వంటి అలవాట్ల ద్వారా మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలి.

నిద్ర కూడా ఆరోగ్యానికి కీలకమైన అంశం. ప్రతిరోజూ సరిపడా నిద్ర లేకపోతే శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. రాత్రివేళ ఆలస్యంగా మేల్కొని ఉండటం, అసమయ భోజనం చేయడం వంటి అలవాట్లు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు సంతానోత్పత్తి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇవి శరీరంలోని కీలక వ్యవస్థలను దెబ్బతీయడంతో పాటు పునరుత్పత్తి సామర్థ్యాన్ని కూడా తగ్గించే ప్రమాదం ఉంది. ఆరోగ్యకరమైన కుటుంబ జీవితాన్ని కోరుకునే వారు ఇటువంటి అలవాట్లకు దూరంగా ఉండటం మంచిది.సంతానం అనేది ప్రతి కుటుంబానికి ఆనందాన్ని అందించే వరం. అయితే దాని కోసం కేవలం వైద్య చికిత్సలపైనే ఆధారపడకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం కూడా అంతే ముఖ్యమైనది. సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, మానసిక ప్రశాంతత, సరిపడా నిద్ర వంటి అంశాలను జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎడారిలో మనిషికి అండగా నిలిచే అద్భుత జీవి.

### - కఠిన పరిస్థితులను సైతం జయించే సామర్థ్యం.. ఒంటెల సంరక్షణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన

**జనం వాయిస్, డెస్క్, జూన్ 21:**

ప్రకృతి సృష్టించిన అద్భుత జీవుల్లో ఒంటెకు ప్రత్యేక స్థానం ఉంది. మండే ఎండలు, నీటి కొరత, ఆహారం లేని పరిస్థితుల్లోనూ జీవించగలిగే సామర్థ్యంతో ఒంటె ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా ఎడారి ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇది కేవలం జంతువు మాత్రమే కాదు, జీవనాధారంగా, కుటుంబ సభ్యుడిగా, ఆర్థిక బలంగా నిలుస్తోంది. ఒంటెల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జూన్ 22న ప్రపంచ ఒంటెల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రపంచంలోని అనేక ఎడారి ప్రాంతాల్లో శతాబ్దాలుగా ఒంటెలు మానవ జీవితంలో భాగమయ్యాయి. ఆధునిక రవాణా వ్యవస్థలు అందుబాటులోకి రాకముందు దూర ప్రాంతాలకు సరుకులు తరలించడంలో ఒంటెలే ప్రధాన ఆధారంగా ఉండేవి. కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ అవి అలసట లేకుండా ప్రయాణించడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఒంటెలే ప్రధాన రవాణా సాధనంగా కొనసాగుతున్నాయి.




ఒంటెల శరీర నిర్మాణం ఇతర జంతువులతో పోలిస్తే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. వాటి మూపురంలో నిల్వ ఉండే కొవ్వు శరీరానికి శక్తిని అందిస్తుంది. ఈ కారణంగా అవి అనేక రోజుల పాటు ఆహారం లేకపోయినా జీవించగలుగుతాయి. అలాగే ఒకేసారి అధిక మొత్తంలో నీటిని తాగి దానిని సమర్థంగా వినియోగించుకునే సామర్థ్యం వాటికి ఉంది. అందువల్ల నీరు దొరకని ఎడారి ప్రాంతాల్లో కూడా అవి సులభంగా మనుగడ సాగిస్తాయి.

ఒంటెల పాదాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. ఇసుకలో కూరుకుపోకుండా వెడల్పుగా ఉండే పాదాల నిర్మాణం వాటికి ఎడారుల్లో సులభంగా నడిచే సామర్థ్యాన్ని కల్పిస్తుంది. ఇసుక తుఫాన్లు వచ్చినప్పుడు ముక్కు రంధ్రాలను మూసుకునే శక్తి, కళ్లను రక్షించే ప్రత్యేక కనురెప్పలు కూడా వాటి ప్రత్యేకతల్లో ఒకటి. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా అవి అభివృద్ధి చెందిన తీరు శాస్త్రవేత్తలను కూడా ఆశ్చర్యపరుస్తోంది.

ఒంటెలు ఆర్థికంగా కూడా ఎంతో విలువైనవి. ఒంటె పాలు పోషక విలువలతో నిండి ఉంటాయి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, రోగనిరోధక శక్తిని పెంచే పదార్థాలు అధికంగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఒంటె పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. కొన్ని దేశాల్లో ఒంటె పాలతో తయారు చేసే ఆహార పదార్థాలు మంచి ఆదాయ వనరుగా మారాయి.

ఒంటె ఉన్ని, తోలు కూడా అనేక పరిశ్రమలకు ఉపయోగపడుతున్నాయి. ఉన్నితో దుస్తులు, దుప్పట్లు తయారు చేస్తారు. తోలుతో వివిధ రకాల వస్తువులు రూపొందిస్తారు. ఈ కారణంగా ఒంటెల పెంపకం అనేక కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది. ముఖ్యంగా ఎడారి ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆర్థిక వ్యవస్థలో ఒంటెల పాత్ర కీలకంగా ఉంది.

భారతదేశంలో రాజస్థాన్ రాష్ట్రం ఒంటెలకు ప్రసిద్ధి చెందింది. అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జాతరల్లో ఒంటెలకు ప్రత్యేక స్థానం ఉంది. పుష్కర్ ఒంటెల జాతర ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. వేలాది ఒంటెలు, లక్షలాది సందర్శకులతో ఈ జాతర సందడిగా సాగుతుంది. పర్యాటక రంగంలో కూడా ఒంటెలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే కాలక్రమేణా ఒంటెల సంఖ్య కొన్ని ప్రాంతాల్లో తగ్గుతోంది. పట్టణీకరణ, మేత భూముల కొరత, యాంత్రీకరణ పెరగడం, సంప్రదాయ జీవన విధానాల్లో మార్పులు రావడం వంటి కారణాలు దీనికి దోహదం చేస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం కూడా ఒంటెల జీవనంపై పడుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో వాటి మనుగడకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు ఒంటెల సంరక్షణ కోసం కృషి చేస్తున్నాయి. ఒంటెల ఆరోగ్యం, పెంపకం, జాతి పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఎడారి ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలకు ఒంటెల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని కూడా అందిస్తున్నాయి. ప్రపంచ ఒంటెల దినోత్సవం సందర్భంగా ఈ అద్భుత జీవుల సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎడారిలో మనిషికి మిత్రుడిగా, సహాయకుడిగా, జీవనాధారంగా నిలిచిన ఒంటెలను సంరక్షించడం మనందరి బాధ్యత. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో, ఎడారి ప్రాంతాల జీవన విధానాన్ని నిలబెట్టడంలో ఒంటెల పాత్ర అమూల్యమైనది. భావితరాలకు ఈ విశిష్ట జీవులను అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# జీవిత నదికి ధర్మపు గట్లు: హద్దు దాటితే అధోగతే!

మనిషి జీవితం ఒక నిరంతర నదీ ప్రవాహం లాంటిది. నది తన గట్లను దాటినప్పుడు వరదగా మారి సర్వనాశనం సృష్టిస్తుంది. అదే విధంగా, మానవుడు ధర్మం అనే లక్ష్మణ రేఖను దాటినప్పుడు, అతని జీవితం అధోగతి పాలవుతుంది. ధర్మం తప్పితే దారి తప్పుతుంది అనే నానుడి కేవలం ఒక సామెత మాత్రమే కాదు అది సహస్రాబ్దాల మానవ అనుభవంలో నుండి జాలువారిన పరమ సత్యం, జీవిత జ్ఞానసారం.నేటి ఉరుకుల పరుగుల ఆధునిక ప్రపంచంలో, భౌతిక సంపదను, తాత్కాలిక పదవులను, అహంకారపూరిత ప్రతిష్ఠను సాధించడానికి మనిషి ఏ దారినైనా తొక్కడానికి సిద్ధపడుతున్నాడు. నైతిక విలువలు అనే పదాలు కేవలం పాఠ్యపుస్తకాల పుటలకే పరిమితమైపోతున్న ఈ సంక్షోభ కాలంలో, ధర్మం యొక్క ప్రాముఖ్యతను సమాజానికి పునరుద్ఘాటించడం మనందరి తక్షణ బాధ్యత.

సంస్కృత మూల ధాతువు "ధృ" నుండి ఉద్భవించిన పదం ఇది. దీనికి నిలబెట్టు లేదా ధరించు అని అర్థం. అనగా, ఏది సమాజాన్ని విచ్ఛిన్నం కాకుండా నిలబెడుతుందో, ఏది మనిషిని మనిషిగా నిలుపుతుందో, అదే ధర్మం. ధర్మం అనేది కేవలం కొన్ని మతపరమైన ఆచారాలకో, పూజా విధానాలకో పరిమితమైన సంకుచిత భావన కాదు అది ఒక విశ్వజనీన నైతిక వ్యవస్థ .సత్యం, న్యాయం, కరుణ, అహింస, నిజాయితీ, పరోపకారం ఇవన్నీ ఆ ధర్మవృక్షానికి ఉన్న వివిధ కొమ్మలు. ప్రతి మనిషికి తన వృత్తిలో, కుటుంబంలో, సమాజంలో ఒక విశిష్టమైన ధర్మం ఉంటుంది. తండ్రికి పితృధర్మం, ఉపాధ్యాయుడికి గురుధర్మం, పాలకుడికి రాజధర్మం. ఈ బాధ్యతలన్నింటినీ చిత్తశుద్ధితో పాటించినప్పుడే సమాజం సుస్థిరంగా, శాంతియుతంగా నిలుస్తుంది.చరిత్ర పుటలను ఒక్కసారి తిరగేస్తే, ధర్మాన్ని వదిలివేసిన వ్యక్తులు, అహంకారంతో ఊగిపోయిన సమాజాలు, సామ్రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయని స్పష్టమవుతుంది. రావణాసురుడు పరాక్రమంలో, వేద విద్యలలో, సంపదలో రాముడికంటే ఏమాత్రం తక్కువవాడు కాదు. కానీ, అతడు పరస్త్రీని అపహరించే ఘోర అధర్మానికి పాల్పడ్డాడు. ఫలితంగా, లంకానగరంతో పాటు ఒక మహావంశమే సర్వనాశనమైంది.ఒక వ్యాపారి అధిక లాభాల కోసం ఆహారాన్ని కల్తీ చేస్తే, అది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు వినియోగదారుడి ప్రాణాలతో చెలగాటమాడే ధర్మోల్లంఘన. ఒక రాజకీయ నాయకుడు అధికారం కోసం అబద్ధాలు చెబితే, అది కేవలం ఎన్నికల వ్యూహం కాదు పాలకుడు పాటించాల్సిన రాజధర్మానికి విరుద్ధం. ఇలాంటి చిన్న చిన్న ధర్మోల్లంఘనలే కాలక్రమేణా మొత్తం సమాజపు పునాదులను కదిలిస్తాయి.నైతిక విలువలు అనేవి కేవలం వ్యక్తిగత గుణాలు కావు; అవి సమాజ నిర్మాణానికి అవసరమైన బలమైన పునాది రాళ్ళు. ఒక ఇల్లు అందమైన గోడలు, రంగుల పైకప్పుతో ఆకర్షణీయంగా కనిపించవచ్చు, కానీ అది నిలబడేది భూమిలోపల ఉండే పునాది బలంపైనే. అదే విధంగా, సమాజం ఎన్ని శాస్త్ర సాంకేతిక రంగాలలో పురోగతి సాధించినా, నైతిక విలువల బలం లేకపోతే అది పేకమేడలా కూలిపోతుంది.సత్యంఅబద్ధాల పునాదులపై నిర్మితమయ్యే సమాజంలో పరస్పర విశ్వాసం నశిస్తుంది. నమ్మకం లేని చోట మానవ సంబంధాలు, వ్యవస్థలు ఒక్కొక్కటిగా కుప్పకూలుతాయి.న్యాయం బలవంతుడికి లొంగిపోయే సమాజంలో బలహీనులు, పేదలు నలిగిపోతారు. న్యాయం నిలిచినప్పుడే ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే హక్కు లభిస్తుంది.కరుణ ఇతరుల బాధను చూసి కరిగే హృదయం లేకపోతే, మనం మనుషులం అనిపించుకోలేము. కరుణ అనేది బలహీనత కాదు అది మానవత్వపు అత్యున్నత శిఖరం.నిజాయితీ ,లౌక్యంతో బతికే ఈ కాలంలో, వ్యక్తిగత మరియు వృత్తి జీవితంలో నిజాయితీగా ఉండటం ఒక గొప్ప సాహసం. ఈ సాహసాన్ని చేసేవారే సమాజానికి నిజమైన నాయకులుగా నిలుస్తారు.నేటి యువతరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఏమిటంటే ఏది సరైనది? అని అంతరాత్మకు తెలిసినా, అందరూ అవినీతి దారిలోనే వెళ్తున్నారు కదా, నేనొక్కడినే ఎందుకు వేరుగా ఉండాలి? అని మనస్సును సమాధానపరచుకోవడం. ఈ సామాజిక ఒత్తిడి ముందు వ్యక్తిగత నైతికత తరచూ ఓడిపోతోంది.సోషల్ మీడియా యుగంలో అబద్ధాలు, అసత్యాలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. తాత్కాలిక ప్రసిద్ధి కోసం, లైకులు మరియు వ్యూస్ కోసం నైతిక విలువలను నడిరోడ్డుపై తాకట్టు పెడుతున్నారు. నేటి పిల్లలు తమ పెద్దల్లో ఆదర్శాలను చూడాలనుకుంటున్నారు. కాబట్టి, ఉపన్యాసాలు దంచడం మానేసి, పెద్దలే ముందుగా ఆదర్శవంతంగా జీవించి చూపించాలి.అయితే, ఈ చీకటిలోనూ ఒక ఆశారేఖ కనిపిస్తోంది. ఎందరో యువకులు, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, బాధ్యతాయుతమైన తల్లిదండ్రులు నేటికీ నైతిక జీవితాన్ని గడుపుతూ సమాజానికి వెలుగు చూపిస్తున్నారు. వారే ఈ సమాజానికి నిజమైన నిలువుటద్దాలు.భారతదేశ చరిత్రలో మహాత్మా గాంధీ సత్యం, అహింస అనే ధర్మాయుధాలతోనే బ్రిటీష్ మహాసామ్రాజ్యాన్ని గడగడలాడించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ న్యాయం, సమానత్వం అనే ధర్మ జ్వాలతో కోట్లాది మంది అణగారిన ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. రామానుజాచార్య, ఆదిశంకరాచార్య వంటి మహర్షులు ధర్మాన్ని కేవలం బోధించలేదు, తామే ఆచరించి చూపారు.మన తెలుగు నేల కూడా ఎందరో ధర్మవీరులను కన్నది. యోగి వేమన తన ఆటవెలది పద్యాల ద్వారా సంక్లిష్టమైన నైతిక విలువలను పామరులకు సైతం అర్థమయ్యేలా చేర్చాడు.అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను సజ్జనుండు బల్కు చల్లగాను

అని హెచ్చరించిన వేమన మాటలు ఈనాటి సోషల్ మీడియా హడావుడికి అద్దం పడుతున్నాయి.ధర్మాన్ని నిలబెట్టడం అంటే నిత్యం దేవాలయాల్లో పూజలు చేయడం, యజ్ఞయాగాలు చేయడం మాత్రమే కాదు. అది నిత్యజీవితంలో మనం తీసుకునే ప్రతి చిన్న నిర్ణయంలోనూ ప్రతిఫలించాలి.పిల్లలకు చిన్నప్పటి నుండే నైతిక విలువలను అలరార్చాలి. అది పాఠ్యపుస్తకాల బట్టీల ద్వారా సాధ్యం కాదు, మన జీవనశైలి ద్వారానే సాధ్యమవుతుంది. నేను చేసే ఈ పని సమాజంలోని అందరూ చేస్తే, అది లోకానికి మేలు చేస్తుందా? అని ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాలి. ఇదే ఇమ్మాన్యుయెల్ కాంట్ చెప్పిన నైతిక సూత్రం, ఇదే మన అంతరాత్మ జరిపే ధర్మ పరీక్ష.సమాజంలో అన్యాయం జరుగుతున్నప్పుడు, మౌనంగా ప్రేక్షక పాత్ర వహించడం కూడా ఒక రకమైన ధర్మోల్లంఘనే అవుతుంది. నాకెందుకు వద్దులే, నాకేం నష్టం లేదు కదా అని తప్పుకోవడం నిష్క్రియాపరమైన అధర్మం. నిజమైన ధర్మవంతుడు అన్యాయాన్ని చూసి స్పందిస్తాడు, ధైర్యంగా నిలబడతాడు.మహాభారతంలో ధర్మరాజు ఎన్నో కష్టాలు అనుభవించాడు, అరణ్యవాసం చేశాడు, అవమానాలు భరించాడు. కానీ, చివరికి కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మమే గెలిచింది. ఇది కేవలం ఒక పురాణ కథ ముగింపు కాదు ఇది నిత్యజీవిత సత్యం.దీర్ఘకాలంలో సత్యం, ధర్మం మాత్రమే నిలుస్తాయి. అధర్మం కొంతకాలం ఆర్భాటంగా ప్రకాశించినా, తెల్లవారుజామున కరిగిపోయే మంచులా మాయమవ్వక తప్పదు. ధర్మం అనే వెలుతురు తరాలు గడిచినా నిరంతరం వెలుగుతూనే ఉంటుంది.ధర్మం తప్పితే దారి తప్పుతుంది అనే నానుడి మనకు హెచ్చరిక మాత్రమే కాదు, అదొక గొప్ప వాగ్దానం. ధర్మాన్ని పట్టుకున్నవారికి జీవితం సరైన దారి చూపుతుంది. ఆ మార్గం ముళ్ళతో కూడి కష్టంగా ఉండవచ్చు, కానీ అది ఆత్మగౌరవంతో, ప్రశాంతతతో కూడిన సన్మార్గం.మన భవిష్యత్ తరాలకు మనం ఏ వారసత్వాన్ని అందివ్వాలనుకుంటున్నాం? కేవలం బ్యాంక్ బ్యాలెన్స్‌లనా, తాత్కాలిక కీర్తినా? లేక ఒక స్వచ్ఛమైన నైతిక సమాజాన్నా? ఆ ఎంపిక మన చేతుల్లోనే ఉంది ఈనాడే, ఇప్పుడే! ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది!



డా .సూర్యదేవర రామకృష్ణ.
9490754169

# వర్షారణ్యాలు కాపాడితేనే భూమికి భవిష్యత్..

**జనం వాయిస్, డెస్క్, జూన్ 21:**

భూమిపై జీవం మనుగడ సాగించడానికి గాలి, నీరు, నేల ఎంత ముఖ్యమో వర్షారణ్యాలు కూడా అంతే కీలకమైనవి. ప్రపంచంలోని అత్యంత సంపన్నమైన పర్యావరణ వ్యవస్థలుగా గుర్తింపు పొందిన వర్షారణ్యాల ప్రాముఖ్యతను గుర్తు చేసేందుకు ప్రతి ఏడాది జూన్ 22న ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రకృతిని కాపాడుకోవడం అంటే కేవలం చెట్లను రక్షించడం మాత్రమే కాదని, భూమిపై ఉన్న కోట్లాది జీవరాశుల భవిష్యత్తును సంరక్షించడమేనని ఈ దినోత్సవం సందేశం ఇస్తోంది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి కొరత, జీవ వైవిధ్య నష్టం వంటి సమస్యలకు పరిష్కారంలో వర్షారణ్యాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

వర్షారణ్యాలు భూమి మొత్తం విస్తీర్ణంలో చాలా తక్కువ భాగాన్ని మాత్రమే ఆక్రమించి ఉన్నప్పటికీ, ప్రపంచ జీవ వైవిధ్యంలో అత్యధిక భాగాన్ని తమలో దాచుకుని ఉన్నాయి. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం భూమిపై ఉన్న వృక్ష, జంతు జాతుల్లో సగానికి పైగా వర్షారణ్యాల్లోనే నివసిస్తున్నాయి. చిన్న కీటకాల నుంచి అరుదైన జంతువుల వరకు లక్షలాది జీవరాశులకు ఇవే సహజ నివాసాలు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ గుర్తించని జీవజాతులు ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అందుకే వర్షారణ్యాలను జీవసంపదకు అద్భుత భాండాగారాలుగా పేర్కొంటారు.

ప్రపంచ వాతావరణ సమతుల్యతను కాపాడడంలో వర్షారణ్యాల పాత్ర అమోఘం. పరిశ్రమలు, వాహనాలు, ఇతర మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలోకి విడుదలవుతున్న కార్బన్ డైఆక్సైడ్‌ను భారీ మొత్తంలో గ్రహించి నిల్వ చేసేది ఈ అడవులే. దీంతో భూతాపం పెరగకుండా కొంతవరకు నియంత్రణ సాధ్యమవుతోంది. వర్షారణ్యాలు లేకుంటే వాతావరణంలో కార్బన్ స్థాయులు మరింత వేగంగా పెరిగి భూమి ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే వీటిని భూమి ఊపిరితిత్తులుగా అభివర్ణిస్తారు.

వర్షారణ్యాలు వర్షపాతాన్ని ప్రభావితం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. చెట్లు తమ ఆకుల ద్వారా నీటి ఆవిరిని వాతావరణంలోకి విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియ మేఘాల ఏర్పాటుకు, వర్షపాతానికి దోహదం చేస్తుంది. అడవులు తగ్గిపోతే వర్షపాతం నమూనాలు మారిపోయి వ్యవసాయం, తాగునీటి వనరులు తీవ్ర ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న కరువు పరిస్థితులకు అటవీ నిర్మూలన కూడా ఒక ప్రధాన కారణంగా పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

వర్షారణ్యాలు భూగర్భ జలాల సంరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. వర్షపు నీటిని నేలలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వలను పెంచుతాయి. అదే సమయంలో వరదల ప్రభావాన్ని కూడా తగ్గిస్తాయి. అడవులు ఉన్న ప్రాంతాల్లో మట్టికోత తక్కువగా ఉండటంతో నదులు, చెరువులు సహజంగా సంరక్షించబడతాయి. అందుకే నీటి భద్రతకు వర్షారణ్యాలు ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అటవీ నిర్మూలన ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది.



కలప కోసం చెట్ల నరికివేత, గనుల తవ్వకాలు, భారీ వ్యవసాయ ప్రాజెక్టులు, పట్టణీకరణ కారణంగా ప్రతి సంవత్సరం లక్షల ఎకరాల అడవులు కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ అమెరికాలోని అమెజాన్ వర్షారణ్యాలు, ఆఫ్రికాలోని కాంగో అడవులు, ఆసియాలోని అనేక అటవీ ప్రాంతాలు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే ప్రపంచ పర్యావరణ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వర్షారణ్యాల ప్రాముఖ్యత కేవలం పర్యావరణానికే పరిమితం కాదు. వైద్య రంగానికి కూడా ఇవి అమూల్యమైన సంపద. అనేక ఔషధ మొక్కలు వర్షారణ్యాల్లో లభిస్తాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తున్న అనేక మందుల తయారీలో ఈ మొక్కల నుంచి లభించే పదార్థాలు వినియోగిస్తున్నారు. ఇంకా పూర్తిగా పరిశోధించని వేలాది మొక్కలు ఈ అడవుల్లో ఉన్నాయి. భవిష్యత్తులో కొత్త వ్యాధులకు చికిత్సలు కనుగొనడంలో ఇవి కీలకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు భావిస్తున్నారు. భారతదేశంలో పశ్చిమ కనుమలు, అండమాన్ నికోబార్ దీవులు, ఈశాన్య రాష్ట్రాల అటవీ ప్రాంతాలు వర్షారణ్యాలకు ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాంతాల్లో ప్రపంచంలోనే అరుదైన జీవజాతులు కనిపిస్తాయి. పులులు, ఏనుగులు, కొండచిలువలు, అరుదైన పక్షులు, ఔషధ మొక్కలు ఈ ప్రాంతాల ప్రత్యేకత. భారతదేశ జీవ వైవిధ్య సంపదలో ఈ వర్షారణ్యాల పాత్ర అత్యంత కీలకమైనది. అందువల్ల వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వర్షారణ్యాలు కూడా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడవి మంటలు, వర్షపాతం మార్పులు అడవుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్ల పెరుగుదల మందగిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో జీవజాతులు అంతరించిపోతున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రకృతి విపత్తులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం సందర్భంగా అడవుల సంరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యమని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. చెట్లను నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతి వనరులను పొదుపుగా ఉపయోగించడం, అడవుల నాశనానికి దారితీసే చర్యలను నిరోధించడం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చు. భావితరాలకు సురక్షితమైన భూమిని అందించాలంటే వర్షారణ్యాల సంరక్షణ అత్యవసరమని, ప్రకృతిని కాపాడితేనే మానవాళి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ఈ ప్రత్యేక దినం ప్రపంచానికి గట్టిగా చాటిచెబుతోంది.

# గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కీలక సమావేశం

**సంఘటన్ సృజన్ అభియాన్, ఓటర్ల జాబితా సవరణపై చర్చ.**
**పార్టీ బలోపేతంపై నేతలకు దిశానిర్దేశం.**
**పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్.**



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 21:**
గాంధీ భవన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించింది. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యకలాపాల విస్తరణపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, శిక్షణ కార్యక్రమాల ఇంచార్జ్ రాంమోహన్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు పాల్గొన్నారు. పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. రానున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో చురుకైన పాత్ర పోషించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని సమావేశంలో సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పొరపాట్లను గుర్తించి సరిచేయించే బాధ్యతను చేపట్టాలని తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల్లో సమన్వయంతో పనిచేస్తూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.






# జయశంకర్ కు కేటీఆర్ ఘన నివాళి

**వర్ధంతి సందర్భంగా స్మరించిన బీఆర్ఎస్ నేతలు.**
**తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు చిరస్మరణీయం.**
**భావజాల వ్యాప్తికి చేసిన కృషిని గుర్తుచేసుకున్న నాయకులు.**



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 21:**
తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడిగా జయశంకర్‌ను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన జయశంకర్ సేవలను కేటీఆర్ గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఉద్యమ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో ఆయన పోషించిన పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ అందించిన మేధోబలం, ఆలోచనా దిశ, సిద్ధాంత పరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఉద్యమకారులకు ఆయన ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన వెనుక ఉన్న ప్రముఖ వ్యక్తుల్లో జయశంకర్ ఒకరని పేర్కొంటూ, తెలంగాణ సమాజం ఆయన సేవలను ఎన్నటికీ మరువదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, స్వాభిమాన పరిరక్షణ కోసం ఆయన చూపిన మార్గం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలు, కృషి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్య హుస్నాబాద్ ఆరోగ్య భారత్ లక్ష్యం: పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్‌లో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు.**
**ఎల్లమ్మ చెరువు కట్టపై యోగాసనాలు వేసిన మంత్రి.**
**ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపు.**

**జనం వాయిస్, హుస్నాబాద్, జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా యోగాసనాలు వేసి ప్రజలకు యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, ఆరోగ్యవంతమైన జీవనానికి యోగ ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ముఖ్యంగా సూర్య నమస్కారాలు శరీరాన్ని దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా యోగ అందిస్తుందని వివరించారు. ప్రజల్లో యోగపై అవగాహన




పెంచేందుకు పట్టణ కేంద్రంలో సూర్య నమస్కారాల వివిధ భంగిమలను ప్రతిబింబించే శిల్పాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. యోగను ప్రజల జీవితాలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి వ్యక్తి తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. "ఆరోగ్య హుస్నాబాద్ ఆరోగ్య భారత్" లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. యోగ సాధనకు వయసుతో సంబంధం లేదని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ యోగ చేయవచ్చని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగ శిక్షకులు, విద్యార్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం రిలీఫ్ ఫండ్

**.సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది**

**యాచారం, జూన్ 21,(జనం వాయిస్ ):**
సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని చౌదర్ పల్లి గ్రామ సర్పంచ్ కేశ మోని రాజు గారు అన్నారు. అదివారం యాచారం మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, గ్రామ సర్పంచ్ కేశమోని రాజు ఆధ్వర్యంలో చౌదర్ పల్లి గ్రామానికి చెందిన కంబాలపల్లి పెంటమ్మ సీఎం రిలీఫ్రూ. 28వేలు,బూడిగాలా అండాలు రూ. 32వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలోగ్రామ ఉపసర్పంచ్ గొరిగే శ్రీశైలం, గ్రామ శాఖ అధ్యక్షులు గౌర శ్రీశైలం,గ్రామ ఉపాధ్యక్షులు కంబాలపల్లి కృష్ణ, గ్రామ ప్రధాన కార్యదర్శి అమీర్పేట బుగ్గ రాములు, గ్రామ వార్డు సభ్యులు కొమ్ము యాదయ్య,గ్రామ మాజీ ఉపసర్పంచ్ లు అమీర్పేట కృష్ణ,ఎడ్లకడి నరసింహ, గ్రామ మాజీ అధ్యక్షులు గొరిగే బిర్రప్ప, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులు కొంగర కృష్ణ, అమీర్పేట గణేష్, కొంగర కృష్ణ, బోద్ర మోని రాజు, యాదగిరి చారి,ఎన్ ఎస్ యు ఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కంబాలపల్లి ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ సార్ 15 వ వర్ధంతి

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 21:**
మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మరియు బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడారు. అమరవీరుల బలిదానాలతో కేవలం భౌగోళిక తెలంగాణ మాత్రమే ఏర్పడిందని, సామాజిక తెలంగాణ సాధన కోసం మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో గత పన్నెన్నర ఏళ్లుగా అతితక్కువ జనాభా కలిగిన వర్గాల పాలన కొనసాగుతోందని, మెజారిటీ వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యం కొనసాగుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జాబ్



క్యాలెండర్ ప్రకటించి, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలివ్వాలన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ. 50 వేల పెన్షన్, ఉచిత రవాణా సౌకర్యం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సామాజిక తెలంగాణ కోసం ఉద్యమకారులు ఏకం కావాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, నాయకులు సత్యనారాయణ, రాంరెడ్డి, రాజేశం, చందు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తితో బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మిద్దాం బీసీ రాజ్యాధికారాన్ని సాధిద్దాం

## ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన బీసీ సమాజ్

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 21:**
బీసీ సమాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన విశిష్ట కృషి, త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ గారు తెలంగాణ రాష్ట్ర సాధనకే కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కూడా నిరంతరం పోరాడారని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తమ హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆచార్య జయశంకర్ గారి స్ఫూర్తితో బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి, బీసీల రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆచార్య జయశంకర్ చూపిన మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ



కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మవరపు బ్రహ్మయ్య, మంచిర్యాల పట్టణ కార్పెంటర్ అధ్యక్షులు పెద్దోజు హనుమంతు, అఖిలభారత విశ్వకర్మ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్, బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి పొట్టాల మల్లేష్, బీసీ సమాజ్ నాయకులు జక్కం రవీందర్, వెన్నంపల్లి మురళి, గుండ్ల లక్ష్మణ్, ఎండి లతీఫ్, తాటిపాముల సమ్మయ్య, సైనోజు నారాయణ చారి, పల్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్ గారికి ఘన నివాళులు అర్పించారని బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ తెలిపారు

RNI NO:TGTEL/26/A0383
దినమిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

## గుడిపేట మెడికల్ కాలేజీని సందర్శించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**అధ్యాపకులు, విద్యార్థుల ఘన స్వాగతం.**
**విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న వైనం.**

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 21:**
మంచిర్యాల నియోజకవర్గం, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గారు సందర్శించారు. ఈ సందర్భంగా కాలేజీకి విచ్చేసిన ఎమ్మెల్యేకు కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మెడికల్ కాలేజీ విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో వసతులు, ఇతరత్రా ఎదురవుతున్న ఇబ్బందులపై విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా చదువుపై దృష్టి సారించాలని, మీకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించడానికి 'నేనున్నానని' ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్లా సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## 'ఫాదర్ ఆఫ్ స్కామ్స్.. హ్యాపీ ఫాదర్స్ డే'

**ప్రధాని మోదీపై పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ వ్యంగ్యాస్త్రాలు.**
**కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలనే టార్గెట్‌గా సెటైర్లు.**
**ఎన్నికల హామీలు ప్రచార నినాదాలుగానే మిగలకూడదని హితవు.**

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 21:**
ఫాదర్స్ డే (పితృ దినోత్సవం) సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర



స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. గత పదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వైఫల్యాలను ఎత్తిచూపుతూ సోషల్ మీడియా వేదికగా ప్రధానికి ఆయన "ప్రత్యేక ఫాదర్స్ డే శుభాకాంక్షలు" తెలిపారు. మోదీని పలు వైఫల్యాలకు 'ఫాదర్'గా అభివర్ణిస్తూ.. "ఫాదర్ ఆఫ్ డీమోనిటైజేషన్, ఫాదర్ ఆఫ్ డ్రామా-బాజ్ పాలిటిక్స్, మెలోడీ డిప్లొమసీ ఫాదర్, రూపాయి పతనానికి ఫాదర్, ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీకి ఫాదర్, నీట్ పేపర్ లీకులు - స్కామ్‌ల ఫాదర్, రైతుల ఆదాయం రెట్టింపు, ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీల ఫాదర్, అచ్చే దిన్ ఫాదర్" అంటూ వ్యంగ్యంగా తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో నేడు యువత, నిరుద్యోగులు, రైతులు, సామాన్య ప్రజలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, పదేళ్ల మోదీ పాలన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఎంపీ వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పాలకులకు జవాబుదారీతనం అత్యంత కీలకమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసం ప్రచార నినాదాలుగానే మిగిలిపోకూడదని ఆయన హితవు పలికారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక అంశాలపై కేంద్రం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసిన ఆయన.. "యే హై ఆజ్ కా భారత్.. హ్యాపీ ఫాదర్స్ డే నరేంద్ర మోదీ జీ.. జై హింద్! జై భారత్!" అంటూ తన సందేశాన్ని ముగించారు

## చిన్న కంజర్లలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు షాక్

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిన 50 మంది నాయకులు, కార్యకర్తలు.**
**రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే.**

**పటాన్చెరు, జనం వాయిస్, జూన్ 21:**
ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలకు చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్ ఊర్మిళ వెంకట్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డిల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో .. 50 మంది కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ప్రజలకు అర్థమైందని.. అతి త్వరలోనే ప్రజలు చరమగీతం పాడతారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకపోగా హైడ్రా పేరుతో విధ్వంసం సృష్టిస్తోందని విమర్శించారు. గత



రెండున్నర సంవత్సరాలుగా పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో అధికార కాంగ్రెస్ పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంతో తిరిగి రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన విజయ్ సింగ్, హనుమంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సాయి, నరేష్ ఈశ్వర్, రాజు, లోకనాథ్ సింగ్, కిరణ్, నబీ, తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఇంద్రేశం మున్సిపల్ కౌన్సిలర్లు ఊర్మిళ వెంకట్ రెడ్డి అంతిరెడ్డి, దుర్గారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శివారెడ్డి, సల్మాన్, సీనియర్ నాయకులు రామచందర్, దుర్గేశ్, సాయికిరణ్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## ఫిలిడెల్ఫియా లో జరిగిన మాటా సభలకి హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**జూన్ 21 జనం వాయిస్ పాలకుర్తి:**
ఫిలిడెల్ఫియాలో జరిగిన మాటా (మన అమెరికా తెలుగు సంఘము) సభలకి హాజరై సేవా సంస్కృతి పరమావధిగా సాగుతున్నటువంటి మాటా వారి సేవలను కొనియాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగు మాట్లాడి తెలుగు యొక్క భాష ఔన్నత్యాన్ని నలుగు దిశలలో చాటి చెప్పాలని కోరిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో మాట వ్యవస్థాపకులు శ్రీనివాస్ గనుగోని, ప్రదీప్ శ్యామల, ప్రెసిడెంట్ కిరణ్ దుంగిడి, మాట 2అం కన్వెన్షన్ కన్వీనర్ శ్రీధర్ గుండాల, మాట ఎగ్జిక్యూటివ్ కమిటీ& కన్వెన్షన్ సభ్యులు, పొలిటికల్ ఫోరం చైర్మన్ భాస్కర్ పిన్నసినీ ప్రముఖులు హీరో సుమన్,జయప్రద, అలీ,నిఖిల్, ఐశర్య రాజేశ్వర్, మరికొందరు సినీతారాలు, ప్రముఖులు హాజరయ్యారు.




## రైతులను మోసం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం



**పాలకుర్తి. జూన్ 21 జనం వాయిస్:**
రైతులు పండించిన మొత్తం వరి ధాన్యాన్ని కొంటానని గొప్పలు చెప్పి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పసునూరి నవీన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ యావత్ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులు పండించిన ప్రతీ పంటను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని మాయ మాటలు చెప్పి ఇప్పుడు కేంద్రం కొంటేనే తాను కొంటానని మోస పూరిత మాటలు మాట్లాడటం సిగ్గుచేటని. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నైజం ఇప్పుడు ప్రజలందరికి తెలిసిపోయిందని అన్నారు. రైతు భరోసా ఇవ్వడంలో కూడా రైతాంగాన్ని మోసం చేసిందని, రుణ మాఫీ చేయడంలో కూడా రైతులను మోసం చేసిన ఘనత కూడ సీఎం రేవంత్రెడ్డికే దక్కిందన్నారు. రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే బిఆర్ఎస్ పార్టీ పక్షాన. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి శ్రీకారం హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాచెర్ల ఎల్లయ్య, పాము శ్రీనివాస్. వీరమనేని సోమేశ్వర్రావు, గుడికుంట తండా, మల్లంపల్లి సర్పంచులు మహేందర్ నాయక్, పోశాల వెంకన్న, గూడ దామోదర్, మాజీ సర్పంచులు బొమ్మగాని కొంరయ్య, కారు పోతుల వెంకటయ్య, పూస్కూరి కలింగరావు, కటారి పాపారావు, గణపురం సురేష్. దొంతమల్ల గణేష్. సురేష్ నాయక్. వెంకట్ నాయక్. గాదపాక శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు. ధాన్యాన్ని కొంటానని గొప్పలు చెప్పి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పసునూరి నవీన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ యావత్ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులు పండించిన ప్రతీ పంటను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని మాయ మాటలు చెప్పి ఇప్పుడు కేంద్రం కొంటేనే తాను కొంటానని మోస పూరిత మాటలు మాట్లాడటం సిగ్గుచేటని. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నైజం ఇప్పుడు ప్రజలందరికి తెలిసిపోయిందని అన్నారు. రైతు భరోసా ఇవ్వడంలో కూడా రైతాంగాన్ని మోసం చేసిందని, రుణ మాఫీ చేయడంలో కూడా రైతులను మోసం చేసిన ఘనత కూడ సీఎం రేవంత్రెడ్డికే దక్కిందన్నారు. రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే బిఆర్ఎస్ పార్టీ పక్షాన. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి శ్రీకారం హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాచెర్ల ఎల్లయ్య, పాము శ్రీనివాస్. వీరమనేని సోమేశ్వర్రావు, గుడికుంట తండా, మల్లంపల్లి సర్పంచులు మహేందర్ నాయక్, పోశాల వెంకన్న, గూడ దామోదర్, మాజీ సర్పంచులు బొమ్మగాని కొంరయ్య, కారు పోతుల వెంకటయ్య, పూస్కూరి కలింగరావు, కటారి పాపారావు, గణపురం సురేష్. దొంతమల్ల గణేష్. సురేష్ నాయక్. వెంకట్ నాయక్. గాదపాక శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

**వైశ్య భవన్ లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం.**
**కార్యక్రమాన్ని నిర్వహించిన ఓం అష్టోత్తర యోగ పీఠ్ స్వామి వివేకానంద యోగా ట్రస్ట్.**

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 21:**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్ లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓం అష్టోత్తర యోగ పీఠ్ స్వామి వివేకానంద యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు గారు మాట్లాడుతూ... మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని దూరం చేసుకునేందుకు యోగా ఒక అద్భుతమైన మార్గమని కొనియాడారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద యోగా ట్రస్ట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రస్ట్ నిర్వాహకులు, యోగా గురువులు, పలువురు ప్రముఖులు, వైశ్య సంఘం ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో యోగా సాధకులు పాల్గొని వివిధ రకాల ఆసనాలను ప్రదర్శించారు.




## మరిపెడలో అయ్యప్ప స్వామి అభిషేకం,పడిపూజ

**మరిపెడ(జూన్ 21)జనం వాయిస్.:**
మరిపెడ పట్టణంలోని శ్రీరామాలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామి అభిషేకం, పడిపూజ కన్నుల పండువగా జరిగాయి. మున్సిపల్ ఛైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. పాల్గొన్న వారు: గంధసిరి రమేష్, బోనగిరి సత్యనారాయణ, తల్లాడ అశోక్, బొడ్డు సంపత్, వెన్నె నాగేశ్వర రావు, షేక్ రహిమోద్దీన్, ఆకుల సోమన్న, వెంకటేష్ తదితరులు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన: పల్లా సుందర్ రాంరెడ్డి.

**జూన్ 21 జనం వాయిస్ పాలకుర్తి:**
జనగామ జిల్లా: దేవరుప్పుల మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కమ్మంపాటి వెంకన్న భాగ్యమ్మ దంపతుల కుమార్తె కళ్యాణి- వినయ్ ల వివాహ వేడుకలకు బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దేవరపుల మాజీ ఎంపీపీ కల్లూరు సోమన్న కొడకండ్ల మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గండిపల్లి , యాకన్న కృష్ణమూర్తి కడవెండి హనుమంతు గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలకు విరాళం.

- గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై జక్కుల పరమేష్.




**జనం వాయిస్, శాయంపేట, జూన్ 21:**
శాయంపేట మండలం తహరాపూర్(మాందారిపేట)గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆదివారం శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం టెక్నీషియన్‌కు రూ.20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని భద్రతను మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహరాపూర్ గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన, ఉపసర్పంచ్ రావుల శ్రీనివాస్, చలువాగు ప్రాజెక్టు డైరెక్టర్ కుక్కల తిరుపతి, తక్కల భాస్కర్ పాల్గొన్నారు.

# మూలమర్రి తండ ప్రజలపై తల్లి ఆశీస్సులు ఉండాలి

## సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా ముత్యాలమ్మ తల్లి పండుగ

**మరిపెడ (జూన్ 21) జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమర్రి తండలో ముత్యాలమ్మ గుడి 7వ వార్షికోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో,వైభవంగా జరిగింది.గ్రామ సర్పంచ్ భూక్యా జానకి రాములు నాయక్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహిళలు బోనాలు ఎత్తి,నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**- కోర్కెలు తీర్చే తల్లి:** తండా గ్రామదేవతగా వెలసిన ముత్యాలమ్మను భక్తులు ఆపదలో ఆదుకునే తల్లిగా కొలుస్తారు.కోరిన వెంటనే కోర్కెలు తీర్చుతుందని ప్రగాఢ నమ్మకం.

**- ప్రజల మొక్కులు:** తండా ప్రజలు చల్లగా ఉండాలని,వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని,ఎలాంటి రోగాలు రాకుండా అమ్మవారి దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు.

**- హాజరైన వారు:** తండా నాయకులు భూక్యా వేంకన్న నాయక్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఏటా ఆషాఢ మాసంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఉత్సవాల సందర్భంగా తండా మొత్తం పసుపు కుంకుమలతో, మామిడి తోరణాలతో శోభాయమానంగా ముస్తాబైంది.తండా వాసులు భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లికి పూజలు చేసి కొరికేలు కోరుకున్నారు.



# వైభవంగా ఉమా మహేశ్వర స్వామి కళ్యాణం.

- భక్తులతో కిటకిటలాడిన మైలారం.
- ఆధ్యాత్మికతను పెంపొందించే ఆలయ ఉత్సవాలు.
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

**జనం వాయిస్, శాయంపేట, జూన్ 21:**
శాయంపేట మండలం మైలారం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ఉమా మహేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు గూడా వెంకట్రాం నర్సయ్య ఆధ్వర్యంలో, దేవాలయ చైర్మన్ రంగు శ్రీనివాస్ సమక్షంలో స్వామివారికి రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రాత్రి ఉమా మహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ ఉత్సవాలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని తనివితీరా దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ నూనె దివ్య తిరుపతి, ఉప సర్పంచ్ మస్కే కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



# అక్రమాలను ప్రశ్నిస్తే కక్ష సాధింపులా..?

## ఉప సర్పంచ్ కుమార్

**జనం వాయిస్, శాయంపేట, జూన్ 21 :**
శాయంపేట మండలం మైలారం గ్రామ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించినందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని గ్రామ ఉప సర్పంచ్ మసికే కుమార్ ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ పరిధిలో చెట్ల నరికివేత, అభివృద్ధి పనుల్లో లోపాలపై ప్రశ్నించిన నేపథ్యంలో తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు.గ్రామంలో విద్యుత్ బిల్లుల పెరుగుదల, బావి వద్ద మీటర్ తొలగింపు విషయంలో అధికారులు సూచనలు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను చట్టపరంగా, శాఖాపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. దళితుడైన తనను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వార్డు సభ్యులు పల్లెబోయిన రాజు, మోతె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# హుస్నాబాద్ జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**జనం వాయిస్, హుస్నాబాద్ జోన్.21:**
12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ జడ్పీ బాలుర హై స్కూల్ హెచ్ఎం కె. వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ యోగాసనాలను సాధన చేసి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హెచ్ఎం కె. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమై, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. విద్యార్థులు ఇంటి వద్ద, పాఠశాలలో ప్రతిరోజూ యోగాసనాలను దినచర్యగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడి ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు వీరారెడ్డి, రాజయ్య, రాజమల్లు, మార్కండేయ, వెంకటమల్లు, నర్సింహులు, బాలయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# దళితులకు 'సమూచిత స్థానం' ఏది..?

- దోర్నకల్ రాజకీయంలో దళితుల అసహనం.
- ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటూ అన్ని రంగాల్లో తొక్కివేత!
- వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ పదవిలో నాటి నుండి నేటికీ దక్కని చోటు.
- 'ప్రజాపాలన'లోనూ దొరలకే పట్టాభిషేకం: కాంగ్రెస్ మండల కమిటీల్లోనూ అన్యాయం!
- హక్కుల సాధన కోసం ఏకతాటి పైకి వచ్చి పోరాడక తప్పదా..?




**కురవి, జూన్ 21 (జనం వాయిస్) :**
మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గ రాజకీయంలో దళితులకు సమూచిత స్థానం కల్పించడంలో ప్రధాన పార్టీలు పూర్తిగా విఫలమవుతున్నాయి. ఎన్నికల సమయంలో దళితులకు పెద్దపీట వేస్తామంటూ, వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామంటూ ఓటు బ్యాంకు రాజకీయాలతో అధికారంలోకి వస్తున్న నాయకులు, తీరా గద్దెనెక్కాక వారిని అన్ని రంగాల్లో తొక్కేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డోర్నకల్ నియోజకవర్గంలో సామాజిక న్యాయం ఎక్కడా కనిపించడం లేదని స్థానిక దళిత వర్గాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

**ఆలయ కమిటీల్లోనూ వివక్షేనా..?**
నియోజకవర్గంలో దళితులపై ఏ స్థాయిలో వివక్ష ఉందో చెప్పడానికి కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ పదవే నిదర్శనంగా నిలుస్తోంది. నాటి నుండి నేటికీ ఈ ప్రతిష్టాత్మక ఆలయ చైర్మన్ పదవిని ఒక్కసారి కూడా దళితులకు కేటాయించకపోవడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రధాన పార్టీలకు దళితులపై ఉన్న వివక్షకు ఈ ఆలయ కమిటీ నియామకాలే సాక్ష్యమని వారు ఆరోపిస్తున్నారు.

**సామాజిక న్యాయం లేని 'ప్రజాపాలన'**
దొరల పాలన పోయి, ప్రజాపాలన వచ్చిందని ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ డోర్నకల్ నియోజకవర్గంలో పరిస్థితి మారలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ కూడా మళ్లీ దొరలకే పట్టాభిషేకం కడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. రాజకీయ రంగంలో దళితులు ఎదగకుండా వ్యూహాత్మకంగా తొక్కేస్తున్నారని, ప్రధాన పార్టీల్లో సమర్థులు, ఉన్నత విద్యావంతులైన దళిత నాయకులు లేరా అని స్థానికులు నిలదీస్తున్నారు.

**మండల కమిటీల్లోనూ దక్కని చోటు**
కనీసం జిల్లా, మండల స్థాయిల్లోని కీలకమైన అధ్యక్ష, కార్యదర్శి పదవుల్లో కూడా దళితులకు చోటు దక్కకుండా రాజకీయం నడుపుతున్నారు. ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ నూతన మండల బాడీ కమిటీ ఎన్నికల్లోనూ డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగింది. మండల అధ్యక్ష పదవుల్లో ఎక్కడా దళితులకు చోటు కల్పించలేదు. దళిత నాయకులను కేవలం పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ కమిటీలకే పరిమితం చేస్తూ, ప్రధాన కమిటీలకు దూరం పెడుతుండటంపై నియోజకవర్గ దళిత శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తమవుతోంది.

**హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి వచ్చి పోరాడక తప్పదా..?**
ఇప్పటికైనా ప్రధాన రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనబెట్టి, దళితులకు రాజకీయంగా, సామాజికంగా సమాన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీల ప్రధాన కమిటీల్లో, కీలకమైన నామినేటెడ్ పదవుల్లో దళితులకు తగిన వాటా దక్కనంత కాలం 'సామాజిక న్యాయం' అనే మాట కేవలం కాగితాలకే పరిమితం అవుతుంది. రాబోయే రోజుల్లోనైనా డోర్నకల్ నియోజకవర్గ దళిత నాయకత్వం తమ హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి వచ్చి పోరాడక తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

## లక్షెట్టిపేట మండలం దౌడేపల్లిలో జాతీయ గ్రామీణ విత్తన ఉత్పత్తి - విత్తన శుద్ధి కేంద్రం ప్రారంభం







**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 21:**
రైతుల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక నిర్మాణాత్మక చర్యలు చేపడుతోందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం దౌడేపల్లి (చందారం)లో చందారం గ్రామ రైతు పొదుపు, పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'జాతీయ గ్రామీణ విత్తన ఉత్పత్తి - విత్తన శుద్ధి కేంద్రాన్ని' మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం ఈ విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇందుకు అవసరమైన మెటీరియల్, పరికరాలను ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని కలెక్టర్ వివరించారు. ఇప్పటివరకు దాదాపు 2 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం సేకరించామని, మిగిలిన 12 వేల క్వింటాళ్లను త్వరలోనే కొనుగోలు చేస్తామని చెప్పారు. రవాణా కొరత లేకుండా సింగరేణి, ఇసుక లారీలను మళ్లించి, వర్షాలు రాకముందే ధాన్యాన్ని గోదాములు, రైస్ మిల్లులకు తరలించామన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే 98 శాతం మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని తెలిపారు. ఆధార్ లింకేజీ ద్వారా విత్తనాలు, యూరియా బుకింగ్ చేస్తున్నామని, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, మారుమూల గ్రామాల్లో భూ సమస్యల సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే పంట మార్పిడి, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో వరితో పాటు 22 వేల టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రూ.452 కోట్ల చెల్లింపులు జరగ్గా, ఒక్క మంచిర్యాల నియోజకవర్గంలోనే దాదాపు రూ.270 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని వెల్లడించారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం కొనుగోలు కేంద్రాలను ఐ.కె.పి.కి కేటాయించామని, కడెం కాలువ 42వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సకాల చర్యల వల్ల గతంలో ఎకరాకు 20-22 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈసారి 28 నుంచి 32 క్వింటాళ్ల రికార్డు స్థాయి దిగుబడి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తూ రైతులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. రైతుల సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కొత్త విత్తన శుద్ధి కేంద్రం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను మార్కెట్ ధరల ప్రకారం అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వాలి.

**పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి.**
**పొన్నబోయిన శ్రీనివాస్.**
**ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షులు.**




**జనం వాయిస్.హుస్నాబాద్, జూన్. 21:**
రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకానికి రైతు భరోసా అని పేరు మార్చి, గత ప్రభుత్వం కంటే ఎక్కువ సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే, గతంలో కేసీఆర్ ప్రభుత్వం అందించిన స్థాయిలో కూడా రైతులకు ఆర్థిక సాయం అందడం లేదని విమర్శించారు. రైతు భరోసా పథకానికి కేటాయించిన నిధులు ఎక్కడికి వెళ్తున్నాయో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. రైతే రాజు, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ప్రభుత్వం ఎకరం, రెండు ఎకరాల పరిమితులతో రైతులకు సాయం అందించడం సరైన విధానం కాదన్నారు. రైతులు పండించిన ఆహారంతోనే సమాజం జీవిస్తుందని, అలాంటి రైతుల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ జీతాలను పూర్తిస్థాయిలో తీసుకుంటున్నప్పుడు రైతుల సాయంలో కోతలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించి, పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా బకాయిలను విడుదల చేయడంతో పాటు అర్హులైన ప్రతి రైతుకు పూర్తి స్థాయిలో ఆర్థిక సాయం అందించాలని పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

# మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పై కాంగ్రెస్ నేతల సవాల్

## రైతులను రెచ్చగొట్టే మీ ప్రయత్నాలు ఫలించబోవని కిషన్ రెడ్డికి సూచన



**ఇబ్రహీంపట్నం, జూన్ 21,(జనం వాయిస్ ):**
ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. 14 ఏళ్లలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, రెండున్నరేళ్లలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని కోరారు.రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, రైతుభరోసా వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ ఆరోపణలను ఖండించారు.ఆరుట్ల పాఠశాల అభివృద్ధి, నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన నిధులపై ప్రజలకు స్పష్టత ఉందని పేర్కొన్నారు.నిత్యం ప్రజల కోసం, ఈ ప్రాంత అభివృద్ధికి తపనపడే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై లేనిపోని విధంగా మాట్లాడితే ఇకపై సహించేదిలేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు మానుకోవాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్ రెడ్డి, 'ఏ' బ్లాక్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్మ నరేంద్ రెడ్డి, లింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# యాచారంలో ఘనంగా ప్రారంభమైన స్టార్ ఫిట్‌నెస్ జిమ్

. ఎన్‌ఎన్‌ఆర్ యువసేన వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం.
.యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని పిలుపు.
. అత్యాధునిక వసతులతో అందుబాటులోకి వచ్చిన స్టార్ ఫిట్‌నెస్ జిమ్.
. ఫిట్‌నెస్ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యమని నిర్వాహకుల వెల్లడి.

**యాచారం, జూన్ 21,(జనం వాయిస్ ):**
మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన “స్టార్ ఫిట్‌నెస్ జిమ్ ఘనంగా ప్రారంభమైంది.నిర్వాహకులు కొమ్ము సురేష్ ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ జిమ్‌ను ఎన్‌ఎన్‌ఆర్ యువసేన వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయిని నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. యువత శారీరక దృఢత్వం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్ అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని పేర్కొన్నారు.యాచారం ప్రాంత యువతీయువకులు ఈ జిమ్ ద్వారా లభించే వసతులను సద్వినియోగం చేసుకుని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. నిర్వాహకులు సురేష్‌ను అభినందిస్తూ, ఈ జిమ్ ఎల్లవేళలా విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు కొమ్ము సురేష్, స్థానిక యువకులు,ఎన్‌ఎన్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు,గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**యాచారం, జూన్ 21,(జనం వాయిస్ ):**
ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని గ్రామ సర్పంచ్ మంగ జంగయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్య గూడ గ్రామానికి చెందిన మాధవరెడ్డి కి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆపద సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లభించే ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గౌర లక్ష్మణ్, మాజీ సర్పంచ్ అచన జంగయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు యార అశోక్, యార వెంకటేష్, 7వ వార్డు సభ్యుడు బొడ్డు శ్రీశైలం, 4వ వార్డు సభ్యుడు ఆర్ల జంగయ్య, మాజీ వార్డు సభ్యుడు గౌర కుమార్, గౌర నర్సింహతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆపద సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లభించే ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకుందాం

**ఇబ్రహీంపట్నం, జూన్ 21, (జనం వాయిస్ ):**
ఇబ్రహీంపట్నం లో ప్రపంచ మోటార్‌సైకిల్ దినోత్సవం సందర్భంగా ఏసీపీ ఆధ్వర్యంలో హెల్మెట్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రాణనష్టాలను నివారించాలనే లక్ష్యంతో ఐబీపీ పోలీసులు, మ్యాడ్ మ్యాక్స్ రైడింగ్ క్లబ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది బైక్ రైడర్లు, పోలీసులు మరియు యువత పాల్గొని ప్రజలకు హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ర్యాలీ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే వెనుక కూర్చునే పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని నిర్వాహకులు వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు గాయాలు కావడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని, సరైన నాణ్యత కలిగిన హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ..రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, వేగ నియంత్రణలో ఉండటం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకపోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



# అలియాబాద్‌లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

## మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం






**మేడ్చల్ జూన్ 21(జనం వాయిస్):-**
12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్‌లో ఉన్న మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన నర్సింగ్ కళాశాల ఆవరణలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ ముంబైకు చెందిన శాస్త్రవేత్త డా. రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యోగా గురువు మార్గదర్శకత్వంలో కళాశాల సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు వివిధ యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శరీరంలోని ప్రతి అవయవాన్ని చైతన్యపరిచే సమగ్ర ఆరోగ్య విధానమని అన్నారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగా వైపు ఆకర్షితులవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా మారడంతో పాటు నిత్య చైతన్యంతో ముందుకు సాగగలరని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. మల్లికార్జున రెడ్డి డైరెక్టర్ అకడమిక్స్), డా. దేవి వైస్ ప్రిన్సిపాల్, నర్సింగ్ కళాశాల, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిగురుమామిడి కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్ రెడ్డి ఎన్నిక.

- 15వసారి శ్రీధర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లు,పాల ఉత్పత్తిదారులు.
- డైరెక్టర్లుగా పొతర్ల శివఆంజనేయులు,మడమడకల మాధవరెడ్డిల ఎన్నిక.




**జనం వాయిస్.చిగురుమామిడి జూన్ 21:**
:పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా,పాల కేంద్రం అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని పాల కేంద్రం అధ్యక్షుడు పన్యాల శ్రీధర్ రెడ్డి తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని కరీంనగర్ డెయిరీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం మేనేజర్ చింతపూల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్ రెడ్డిని,డైరెక్టర్లుగా పోతర్ల శివాంజనేయులు,మడమడకల మాధవరెడ్డిని ఎన్నుకున్నట్లు మేనేజర్ నాగయ్య తెలిపారు. అనంతరం మేనేజర్ నాగయ్య మాట్లాడుతూ రైతులు మేలైన జాతికి చెందిన గేదెలను,ఆవులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల కష్టనష్టాల్లో పాలుపంచుకుంటుందన్నారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను కరీంనగర్ డైరీ అమలు చేస్తుందని గుర్తు చేశారు.5వందల లీటర్ల పాల ఉత్పత్తిని వెయ్యి లీటర్లకు పెంచాలని సూచించారు.పాల ఉత్పత్తిదారులకు కూల్ వాటర్ క్యాన్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో రూట్ సూపర్వైజర్ అప్పాల మల్లయ్య,డైరెక్టర్లు పెనుకుల సంపత్,చొప్పదండి సుధాకర్,పొన్నం బాలయ్య, పొతరవేణి అనిల్,మల్లం కుమారస్వామి,పోలోజు రజిత,పెనుకుల స్వప్న,పాల కేంద్రం కార్యదర్శి చకిలం శ్రీనివాస్,టెస్టర్ మల్లం శ్రీనివాస్ తోపాటు పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు వరసల రహదారి బాధితులకు న్యాయం చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్ కు సుందరగిరి గ్రామ పాలకవర్గం వినతి.
- ప్రభుత్వం తరపున బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి హామీ.



**జనం వాయిస్./చిగురుమామిడి జూన్ 21:**
:నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా ఇండ్లు,విలువైన ప్లాట్స్ కోల్పోతున్న బాధితులను ప్రభుత్వం తరపున తప్పకుండా ఆదుకోవాలని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను సుందరగిరి గ్రామ గ్రామపంచాయతీ పాలకవర్గం,బాధితులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాలుగు వరసల రహదారి నిర్మాణంలో భాగంగా ఇండ్లు,విలువైన కాళీ స్థలాలను కోల్పోతున్న తమకు తీవ్ర నష్టం జరుగుతోందని బాధితులు మంత్రి ముందు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న ఇండ్లను రోడ్డు విస్తరణ పేరుతో కోల్పోతుండటం వల్ల తాము రోడ్డున పడే పరిస్థితి వస్తుందని మంత్రికి వివరించారు.ప్రభుత్వం స్పందించి మార్కెట్ ధర ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించాలని,ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు ప్రత్యామ్నాయ పునరావాసంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు కోరారు.బాధితులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని,ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకట రమణారెడ్డి,ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,నాలుగు వరసల రహదారి బాధితులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# “మేడ్చల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం.**
**పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో వందలాది మంది యోగా సాధన.**




**మేడ్చల్, జూన్ 21(జనం వాయిస్):**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ పట్టణంలోని శ్రీ గార్డెన్‌లో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. “ఆరోగ్యం కోసం యోగా“ అనే భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాలు, కాలనీల నుంచి వందలాది మంది యోగా సాధకులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు పాల్గొని యోగా సాధన చేశారు. ఉదయం ఐదున్నర గంటలకు లోక కళ్యాణం కోసం యజ్ఞం నిర్వహించి న అనంతరం ప్రారంభమైన ఈ కార్యక్రమం యోగా ప్రాధాన్యతపై అవగాహన కల్పించే సందేశాలతో ప్రారంభమైంది. అనంతరం యోగా గురువుల మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ అధికారిక ప్రోటోకాల్ ప్రకారం వివిధ యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర సాధనలు నిర్వహించారు. పాల్గొన్న వారు ఉత్సాహంగా యోగా విన్యాసాలు చేస్తూ ఆరోగ్యకర జీవన విధానానికి తమ మద్దతును తెలియజేశారు.

### యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతిలో విడదీయరాని భాగమని, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన యోగాను ప్రపంచానికి పరిచయం చేయడంలో భారతదేశం కీలక పాత్ర పోషించిందన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, అనారోగ్య సమస్యల నుంచి బయటపడటానికి యోగా అత్యంత ప్రభావవంతమైన మార్గమని పేర్కొన్నారు.

నిత్యం కనీసం అరగంట పాటు యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

### ప్రధాని మోదీ చొరవతో ప్రపంచవ్యాప్త గుర్తింపు

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణను వక్తలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రతిపాదనతో 2015 నుంచి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గత పన్నెండు సంవత్సరాలుగా ప్రపంచంలోని వందలాది దేశాల్లో కోట్లాది మంది యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటూ యోగా విశిష్టతను చాటుతున్నారని పేర్కొన్నారు.

### ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అవసరం

ఆరోగ్యవంతమైన వ్యక్తులు, ఆరోగ్యవంతమైన కుటుంబాలు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఔషధాలపై ఆధారపడకుండా సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగంతో ఏర్పడుతున్న ఆరోగ్య సమస్యలను యోగా ద్వారా అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమం ముగింపులో పతంజలి యోగ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల్లో యోగా పట్ల మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిబిరాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి సభ్యులు, యోగా గురువులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, మహిళలు, యువత, విద్యార్థులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. యోగా సాధనతో శ్రీ గార్డెన్ ప్రాంగణం ఆధ్యాత్మిక, ఆరోగ్యవంతమైన వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకులు ఎం కిషోర్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, ప్రధాన కార్యదర్శులు ప్రేమ్ దాస్, వంశీ విజయ్, ఎల్లంపేట మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు పుష్పారెడ్డి, యోగ సాధకులు రాధాకృష్ణ, నారాయణ గౌడ్, హరినాథ్, శివశంకర్, నరసింహారెడ్డి, విజయ, ప్రవీణ, కవి రాజ్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, తారక్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

# రవాణా చార్జీల గోల్మాల్ కథనం పై.. ఉలిక్కిపడ్డ ఉపసర్పంచ్..?

- రైతుల ఫిర్యాదులతో కలకలం.. రాజకీయ రంగు పులుముతున్నారా..?
- అధికారులపై ఒత్తిళ్లకు తెరలేపుతున్నారా..? రైతుల్లో అనుమానాలు.
- నిజాలు బయటపడతాయనే భయంతోనే ఆరోపణలా..? మైలారంలో చర్చ.

**జనం వాయిస్, శాయంపేట, జూన్ 21:**
శాయంపేట మండలంమైలారం గ్రామంలోని ఓడీసిఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు రావాల్సిన రవాణా చార్జీల బకాయిల వ్యవహారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. “రైతుల రవాణా భత్యాలను మింగేసింది ఎవరు..?“ అనే జనం వాయిస్ కథనం అనంతరం రైతులు నేరుగా జిల్లా కలెక్టర్ను ఆశ్రయించడం, గ్రీవెన్స్లో ఫిర్యాదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్ర నిర్వహణలో ఉన్న ఉపసర్పంచ్ మష్కె కుమార్ స్పందిస్తూ, గ్రామ సర్పంచ్ తన పనులను చూసి ఓర్వలేక తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, రాజకీయ కక్షతోనే ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించినట్లు సమాచారం. అయితే, ఉపసర్పంచ్ చేసిన ఈ వ్యాఖ్యల్లో అవాస్తవం ఉందని కొందరు రైతులు పేర్కొంటూనే, అసలు సమస్య రైతులకు రావాల్సిన రవాణా చార్జీల చెల్లింపులేనని, వాటిపై స్పష్టత ఇవ్వకుండా రాజకీయ ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించడం సమంజసం కాదని అభిప్రాయపడుతున్నారు. రైతుల ప్రకారం, ధాన్యం మిల్లులకు తరలింపు, వే బ్రిడ్జి కాంటా రసీదులు, చెల్లింపుల ప్రక్రియ మొత్తం నిర్వాహకుల పర్యవేక్షణలోనే జరిగిందని, ఇప్పుడు “నాకేం తెలియదు.. కాంట్రాక్టర్ చూసుకున్నాడు“ అనే సమాధానం మరిన్ని అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. కేంద్ర నిర్వహణలో బాధ్యతలు నిర్వర్తించిన వారు పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, రైతుల ఫిర్యాదులపై విచారణ చేపట్టాల్సిన అధికారులపై రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిళ్లు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. నిజానిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే కొందరు రాజకీయ ముసుగులో అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ గ్రామంలో సాగుతోంది.రైతుల ఫిర్యాదులపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా వాస్తవాలను వెలికితీయాలని గ్రామ రైతులు కోరుతున్నారు. రవాణా చార్జీల వ్యవహారంలో అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులెవరైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీలో వాసవి ఎలైట్ వెంచర్‌కు శ్రీకారం

### .వాసవి ఫ్యూచర్ సిటీ ఎలైట్ వెంచర్ ఘన ప్రారంభోత్సవం

**యాచారం, జూన్ 21, (జనం వాయిస్ ):**
మండలంలోని నజ్దిక్ సింగారం గ్రామ రెవెన్యూ పరిధిలో వాసవి డెవలపర్స్ ఆధ్వర్యంలో వాసవి ఫ్యూచర్ సిటీ ఎలైట్ వెంచర్ ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఆధునిక హంగులతో ఈ వెంచర్ ను ఏర్పాటు చేస్తున్నామని డైరెక్టర్ తోట రాంబాబు తెలిపారు.ఈ అవకాశాన్ని కస్టమర్లు ఉపయోగించుకోవాలన్నారు.దాదాపు 26 ఎకరాల్లో సువిశాల ప్రదేశంలో కస్టమర్లకు మంచి లాభాలు వచ్చేటట్లు 100 శాతం వాస్తుతో ప్లాట్లు అమ్మకానికి సిద్ధం చేశామన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి డైరెక్టర్స్ తోట రాంబాబు,మేనేజింగ్ డైరెక్టర్ తోట శ్రీనివాస్,తోట శివ ప్రసాద్,డైరెక్టర్స్ ఫణిరాజా మూర్తి డెవలపింగ్ పార్టనర్ లీగల్ అడ్వైజర్ విజయభాస్కర్ రెడ్డి,హైకోర్టు అడ్వకేట్ రమేష్ గౌడ్,రాజు నాయక్,నల్లోల్ల రాజు,చంద్రశేఖర్,సంఘమిత్రుడు కిషన్ రెడ్డి,మార్కెటింగ్ మిత్రులు శ్రీకాంత్,కిషన్,ప్రవీణ్ రెడ్డి,చంద్రమోహన్,ప్రభాకర్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.




# మందమర్రి సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ





**జనం వాయిస్, మందమర్రి, జూన్ 21:**
12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మందమర్రి సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం యోగా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యోగ గురువులు కొంపల్లి రమేష్, బర్ల సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది యోగా సాధకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి మందమర్రి జీఎం రాధాకృష్ణ హాజరుకాగా, గౌరవ అతిథులుగా ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ నీరజ, బీజేపీ రాష్ట్ర నాయకులు అంధుగుల శ్రీనివాస్, టీటీడీ ధర్మాచార్య చంద్రశేఖర్ పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచారి ఆధ్వర్యంలో పతంజలి మహర్షి, సూర్యభగవాన్, వ్యాస మహర్షి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో సామూహిక సూర్యనమస్కారాలు, వివిధ యోగాసనాలు, ప్రాణాయామ సాధనలు నిర్వహించారు. జీఎం రాధాకృష్ణ సమక్షంలో పాల్గొన్న సభ్యులు యోగాసనాలు చేసి ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంపొందించుకున్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు, సీనియర్ సిటిజన్లు యోగాసనాలు చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలతో పాటు ఆకట్టుకునే యోగ డ్యాన్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు ముల్కల శంకర్, ఆయుష్ ఉపాధ్యాయులు జి. రామ్ మోహన్, శైలజ, సూర్యనమస్కారాల రికార్డు హోల్డర్లు మద్ది శంకర్, వెంకటేశ్వర్లు, యోగ సభ్యులు, మహిళా సభ్యులు, సీనియర్ సిటిజన్ యోగ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. “యోగ ఫర్ హెల్తీ ఏజింగ్“ అనే భావనకు అనుగుణంగా, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ సాధన అవసరాన్ని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. ప్రస్తుతం మందమర్రిలో నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్ యోగ ప్రాజెక్టుకు ఈ యోగా దినోత్సవం మరింత ప్రేరణగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# సింధు హాస్పిటల్‌లో సింగరేణి హెల్ప్ డెస్క్ ప్రారంభం

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 21:**
సింగరేణి ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హైటెక్ సిటీలోని సింధు హాస్పిటల్‌లో ప్రత్యేక సింగరేణి హెల్ప్ డెస్క్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగరేణి కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలకోటయ్య, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించడం హర్షణీయమని పేర్కొన్నారు. సింగరేణి కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగపడే నిర్ణయమని వారు అన్నారు. సింధు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ అంథోనీ లాజర్ బాసిల్ మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, ముఖ్యంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తమ ఆసుపత్రి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. హెల్ప్ డెస్క్ ద్వారా రోగులకు వేగవంతమైన సేవలు, అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మార్కెటింగ్ అధికారులు సురేష్ కుమార్, నాగ వంశీ, బిల్లింగ్ అధికారులు కృష్ణారెడ్డి, జగదీశ్వరి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆళవందార్ వేణు మాధవ్, బీరయ్య, రఫిక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# పేద రైతుల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదు

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి

**జనం వాయిస్, ముత్తారం:**
దర్యాపూర్ లో గత 40 సంవత్సరాలుగా దర్యాపూర్ ఉమ్మడి గ్రామ రైతులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను ప్రభుత్వం ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం కారణం కూడా తెలపకుండా బలవంతంగా లాక్కోవాలని చూడటం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన లో మాట్లాడుతూ. దశాబ్దాలుగా పేద ప్రజలు నమ్ముకున్న ఈ భూములకు గత ప్రభుత్వాల హయాంలోనే ప్రభుత్వ పథకాల కింద కరెంట్ పోల్స్, బావుల మంజూరు వంటివి జరిగాయని, నాటి నుండి నేటి వరకు వారు కష్టపడి పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారని గుర్తుచేశారు.



**రత్నాపూర్‌లో ఒక న్యాయం.. దర్యాపూర్ లో ఒక న్యాయమా?**

“గతంలో రత్నాపూర్‌లో ఒక ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సేకరించిన అసైన్డ్ భూములకు ప్రభుత్వం చట్టబద్ధంగా నష్టపరిహారం చెల్లించింది. అక్కడ రైతులకు న్యాయం చేసిన ప్రభుత్వం, ఇక్కడ దద్యాపూర్ పరిధిలో మాత్రం ఎలాంటి పరిహారం ఇవ్వకుండా, అసలు అక్కడ ఏం నిర్మిస్తున్నారో.. దానివల్ల ప్రజలకు వచ్చే లాభం ఏంటో చెప్పకుండా దౌర్జన్యంగా వ్యవహరించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి?“ అని ప్రశ్నించారు. అధికారుల చుట్టూ రైతులను తిప్పుతూ అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించి, అక్కడ ఏం నిర్మిస్తున్నారో స్పష్టత ఇచ్చిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుపేద రైతుల పొట్టగొట్టి, ప్రైవేటు ఆస్తులను కూడబెట్టేలా ఉన్న మంత్రి చర్యలను తాము అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో త్వరలోనే ఎంఆర్ఓ ఆఫీస్ ముందు రిలే నిరాహార దీక్షలకు కూర్చుంటామని, బాధితులకు న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# మందమర్రిలో ఘనంగా రక్తదాన శిబిరం

**జనం వాయిస్, మందమర్రి, జూన్ 21:**
మందమర్రి పట్టణంలోని బెతేస్ద వర్షిప్ సెంటర్‌లో ఆదివారం నిఖిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని యువతకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దైవజనులు పాస్టర్ జైపాల్ రెడ్డి, అమూల్య రెడ్డి, దిలీప్ రెడ్డి రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 42 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు, రెడ్ క్రాస్ సొసైటీ బృందం సభ్యులు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రశంసాపత్రాలు (సర్టిఫికెట్లు) అందజేశారు. అనంతరం పాల్గొన్న వారందరికీ పాస్టర్ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.



# యాదవుల విద్య, ఉపాధి, సంక్షేమ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

### రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్‌ను కలిసిన బీసీ జేఏసీ కో-కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్

**జనం వాయిస్, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మారబోయిన రఘునాథ్ యాదవ్ గారిని బీసీ జేఏసీ కో-కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూనె హరిబాబు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యాదవ సామాజిక వర్గం సమగ్ర అభివృద్ధికి యాదవ కార్పొరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. ముఖ్యంగా యాదవ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యా ప్రోత్సాహం, విదేశీ విద్యా సహాయం, పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్, హాస్టల్ సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా యాదవ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, గొర్రెలుపశుసంవర్ధక రంగాలకు ప్రోత్సాహక పథకాలు విస్తృతంగా అమలు చేసి యాదవ కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మారబోయిన రఘునాథ్ యాదవ్ గారు, యాదవ సమాజ విద్యా, సామాజిక, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రతి అర్హ లబ్ధిదారునికి కార్పొరేషన్ ద్వారా ప్రయోజనాలు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో




యాదవ సమాజ అభ్యున్నతి, విద్యా అవకాశాల విస్తరణ, యువత ఉపాధి, స్వయం ఉపాధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

# జీవితాన్ని ఆధీనంలోకి తెచ్చుకోవడమే యోగ

**జనం వాయిస్, మంథని, జూన్ 21:**
యోగ అంటే ఆసనాలు వేయడమో ఊపిరి బిగ పట్టడమో కాదు జీవితాన్ని ఆధీనంలోకి తెచ్చుకోవడమే యోగా అని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మంథని ప్రభుత్వ కళాశాల మైదానంలో యోగా ప్రాముఖ్యతను గురించి వాకర్స్ కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలితో కొని తెచ్చుకుంటున్న వ్యాధుల్ని ఎదుర్కోవడానికి యోగ ఒక పరమ ఔషధం లాగా ఉపయోగపడుతుందని, ఉరుకులు పరుగుల జీవితంలో ఆత్మకు స్వచ్ఛత, మనసుకు ప్రశాంతత, ఒంటికి వ్యాయమం, ఏది ఉండట్లేదని ఈ పరిస్థితుల్లో మానవాళికి అందుబాటులో ఉన్న అతిపెద్ద భాగ్యం యోగా అని ఆయన తెలిపారు. గాడి తప్పిన శరీరాన్ని సరైన దారిలో పెట్టడానికి ఆసనాలు ఉపయోగపడతాయని అంతర్గత ఉన్నతికి ప్రాణాయామ, ధ్యానం దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు ప్రతిరోజు వాకింగ్ చేయడంతో పాటు యోగాసనాలు ప్రాణాయామం ధ్యానం తప్పనిసరిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గంధం ఆంజనేయులు కోశాధికారి తగరం రాజు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య వాకర్స్ అసోసియేషన్ నాయకులు తాటి సమ్మయ్య గౌడ్, వీర శంకర్ గౌడ్, దొరగొర్ల రవి, కేసారపు రవి, బొద్దుల సమ్మయ్య, ఆకుల రాజబాబు, తాటి విజయ్ కుమార్ గౌడ్, డిష్ రవి, ఇసంపల్లి కొమురయ్య, కర్రు శ్రీనివాస్, కొమురోజు శ్రీనివాస్, వేల్పుల గట్టయ్య, ఒల్లాల రామ్మూర్తి, రావికంటి మనోహర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాలలో నీట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

**జనం వాయిస్, రామగుండం:**
మంచిర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,డీసీపీ ఎ. భాస్కర్ తో కలిసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య, భద్రతా ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే,పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు,ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా తరలించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నిర్వహణతో పాటు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు,ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించేందుకు అవసరమైన అన్ని



ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.



## శ్రీలంక-ఏపై భారత్-ఏ ఘన విజయం

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ జట్టు మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఫైనల్లో శ్రీలంక-ఏపై 66 పరుగుల తేడాతో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు నిర్ణీత ఓవర్లలో 378 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం 379 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక-ఏ జట్టు 311 పరుగులకే ఆలౌటైంది. శ్రీలంక తరఫున వనుజ సాహన్ 62 పరుగులు, సదీర సమరవిక్రమ 52 పరుగులు చేసి పోరాడినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. భారత్-ఏ బౌలర్లలో యష్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో మూడు వికెట్లు పడగొట్టగా, అనుకుల్ రాయ్ రెండు వికెట్లు తీశాడు. ఆకిబ్ ఖాన్, తిలక్ వర్మ చెరో వికెట్ సాధించి శ్రీలంక ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు.

# ఫిఫా ప్రపంచకప్ 2026లో చరిత్రాత్మక రికార్డులు

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. గత 68 ఏళ్ల ప్రపంచకప్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత వేగంగా 100 గోల్స్ నమోదు అయిన ఎడిషన్‌గా ఈ టోర్నీ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం 33 మ్యాచ్‌లు ముగిసే సమయానికే ఆటగాళ్లు ఈ మైలురాయిని అందుకోవడం విశేషంగా మారింది. స్వీడన్‌తో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ స్టార్ ఆటగాడు కోడి గాక్‌పో మూడో గోల్ సాధించడంతో అది ఈ టోర్నమెంట్‌లోని 100వ గోల్‌గా నమోదైంది. దీంతో ఈ ప్రపంచకప్ అత్యంత వేగంగా వంద గోల్స్ పూర్తి చేసిన టోర్నీగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ గోల్‌తో నెదర్లాండ్స్ ఫుట్‌బాల్ చరిత్రలో వంద గోల్స్ పూర్తి చేసిన ప్రత్యేక క్లబ్‌లో చోటు దక్కించుకున్న ఎనిమిదో దేశంగా నిలిచింది. టోర్నీ మొత్తం మీద జట్ల దూకుడు ఆట, దాడి శైలి ఈ రికార్డుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇక ఇదే ప్రపంచకప్‌లో మరో చారిత్రాత్మక ఘట్టం కూడా నమోదైంది. మాంటెరే స్టేడియంలో జపాన్, ట్యునీషియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో 1,000వ మ్యాచ్‌గా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ మ్యాచ్ మైలురాయి పరంగా మాత్రమే కాకుండా అభిమానుల ఆసక్తి పరంగా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకే టోర్నమెంట్‌లో అత్యంత వేగంగా 100 గోల్స్ నమోదు కావడం, అలాగే 1,000వ మ్యాచ్ పూర్తి కావడం వంటి రెండు అరుదైన ఘట్టాలు ఒకేసారి చోటు చేసుకోవడం ఫుట్‌బాల్ ప్రపంచంలో చరిత్రాత్మక సందర్భంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.



# ఇంగ్లండ్ పర్యటనకు భారత వన్డే జట్టు ప్రకటన

**జైస్వాల్‌కు షాక్, కోహ్లిరోహిత్‌లకు అవకాశం**

2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని భారత క్రికెట్ సెలెక్టర్లు అనుభవం మరియు యువ ప్రతిభ కలయికతో ఇంగ్లండ్ పర్యటన కోసం వన్డే జట్టును ప్రకటించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ప్రకటించిన ఈ 15 మంది జట్టులో సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలకు మరోసారి అవకాశం లభించింది. అఫ్గనిస్థాన్‌పై చెపాక్‌లో శతకం సాధించిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను మాత్రం ఈసారి జట్టులో నుంచి తప్పించడం గమనార్హంగా మారింది. ఈ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జట్టు నాయకత్వ బాధ్యతలను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించగా, శ్రేయాస్ అయ్యర్‌ను ఉపనాయకుడిగా నియమించారు. వికెట్ కీపర్లుగా కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్‌లకు అవకాశం ఇచ్చారు. ఆల్‌రౌండర్ల విభాగంలో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ రెడ్డి, హర్షిత్ రానా ఎంపికయ్యారు. పేస్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణతో పాటు యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు చోటు దక్కింది. జూలై 14 నుంచి ఇంగ్లండ్‌లో ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్ ఈ జట్టుకు 2027 ప్రపంచకప్ దిశగా కీలక పరీక్షగా నిలవనుంది.



# రూ.15 వేల జీతంతో కూడా పర్సనల్ లోన్ వస్తుందా?

ఆధునిక కాలంలో అత్యవసర ఖర్చులు, వ్యక్తిగత అవసరాల కోసం పర్సనల్ లోన్‌లపై ఆధారపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే నెలకు రూ.15,000 జీతం ఉన్నవారికి కూడా బ్యాంకులు లోన్ ఇస్తాయా? అనే సందేహం చాలా మందిలో ఉంది.

పర్సనల్ లోన్ అనేది ఎలాంటి పూచీకత్తు లేకుండా ఇచ్చే అన్‌సెక్యూర్డ్ రుణం కావడంతో, బ్యాంకులు దరఖాస్తుదారుడి ఆదాయం, ఉద్యోగ స్థిరత్వం, క్రెడిట్ స్కోర్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం రూ.20,000, ప్రైవేట్ ఉద్యోగులకు రూ.25,000కు పైగా నెల జీతం ఉంటేనే పెద్ద బ్యాంకులు లోన్ మంజూరు చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే రూ.15,000 జీతం ఉన్నవారికి లోన్ పూర్తిగా అసాధ్యం కాదు. కానీ ఇది ఎక్కువగా ప్రైవేట్ బ్యాంకుల కంటే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (చీదీఖీజలు), డిజిటల్ లెండింగ్ యాప్‌ల ద్వారా సాధ్యమవుతుంది. బజాజ్ ఫిన్‌సర్వ్, క్రెడిట్ బీ, క్యాషే వంటి సంస్థలు తక్కువ ఆదాయ వర్గాలకు కూడా చిన్న మొత్తంలో రుణాలు అందిస్తున్నాయి. ఇందులో ముఖ్యమైన అంశం క్రెడిట్ స్కోర్. 750 కంటే ఎక్కువ సిబిల్ స్కోర్ ఉంటే, తక్కువ జీతం ఉన్నా కూడా లోన్ మంజూరు అయ్యే అవకాశం పెరుగుతుంది. గత రుణాలు, క్రెడిట్ కార్డ్ బిల్లులు సకాలంలో చెల్లించడం ద్వారా మంచి క్రెడిట్ హిస్టరీని నిర్మించుకోవచ్చు. రూ.15,000 జీతం ఉన్నవారికి సాధారణంగా రూ.25,000 నుంచి రూ.50,000 వరకు మాత్రమే లోన్ లభించే అవకాశం ఉంటుంది. అలాగే నెలవారీ ఈఎంఐ చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి రుణ పరిమితి నిర్ణయిస్తారు. కొన్ని సందర్భాల్లో కో-అప్లికెంట్‌ను చేర్చడం, బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో ఆదా చూపించడం, ఉద్యోగ స్థిరత్వాన్ని నిరూపించడం వంటి అంశాలు లోన్ ఆమోదానికి సహాయపడతాయి. అయితే తక్కువ జీతం ఉన్నవారికి ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇలాంటి లోన్‌లను జాగ్రత్తగా తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.




# తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు భారీగా పెరుగుదల

తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు సామాన్యులకు భారంగా మారాయి. డిమాండ్ పెరుగుదలతో పాటు సరఫరా తగ్గడం వంటి కారణాల వల్ల చికెన్ ధరలు కిలోకు దాదాపు రూ.300 స్థాయికి చేరుకున్నాయి. దీంతో మాంసాహార ప్రియులు చికెన్ కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.280 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం, అమలాపురం, భీమవరం ప్రాంతాల్లో కూడా దాదాపు ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి. కామారెడ్డిలో రూ.280, వరంగల్‌లో రూ.270, గుంటూరులో రూ.250 నుంచి రూ.270 మధ్య చికెన్ అందుబాటులో ఉంది. ప్రాంతాన్ని బట్టి స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. చికెన్ ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా ఎండల ప్రభావం, ఫారమ్‌లలో ఉత్పత్తి తగ్గుదల, దాణా ధరల పెరుగుదల వంటి అంశాలు చెబుతున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు నేరుగా మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని పౌల్ట్రీ వ్యాపారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా వారాంతాలు, పండుగలు, శుభకార్యాల సమయంలో డిమాండ్ పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. వ్యాపారులు కొనుగోలు ధరల ఆధారంగా రిటైల్ రేట్లు నిర్ణయిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో చికెన్ ధరలు మరింత స్థిరంగా లేదా అధిక స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## తక్కువ ధరలో బెస్ట్ లో-స్పీడ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవే

భారతదేశ ఆటోమొబైల్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి వినియోగదారులు తక్కువ ధరలో ఎక్కువ మైలేజ్ ఇచ్చే ద్విచక్ర వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. పెట్రోల్ స్కూటర్ల ధరలు లక్ష రూపాయలు దాటిపోవడంతో, లో-స్పీడ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు రోజువారీ అవసరాలకు మంచి ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. మోటారు వాహనాల చట్టం 1988 ప్రకారం గంటకు 25 కిలోమీటర్ల లోపు వేగం కలిగిన వాహనాలకు డ్రైవింగ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ అవసరం ఉండదు. ఈ నేపథ్యంలో మార్కెట్లో అందుబాటులో ఉన్న తక్కువ ధరలోని కొన్ని ప్రముఖ మోడళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఆంపియర్ రియో ఎలైట్ మోడల్ ధర సుమారు రూ.42,999గా ఉంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 5560 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. ఒకినావా ఆర్30 ధర సుమారు రూ.58,992 కాగా, ఇది సింగిల్ ఛార్జ్‌పై 60 కిలోమీటర్ల రేంజ్ అందిస్తుంది. లోహియా ఓమా స్టార్ అత్యంత తక్కువ ధరలో సుమారు రూ.40,850కే లభిస్తుంది. ఇది 70 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుంది. కోమాకి ఎక్స్‌జిటి కేఎం మోడల్ సుమారు రూ.42,500 ధరతో 130 నుంచి 150 కిలోమీటర్ల వరకు అద్భుతమైన రేంజ్ అందిస్తోంది. ఆంపియర్ రియో ఎలైట్ కొత్త వేరియంట్ ధర సుమారు రూ.44,000గా ఉండగా, ఇది వేగంగా ఛార్జ్ అవుతూ 60 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. తక్కువ బడ్జెట్‌లో రోజువారీ ప్రయాణాలకు సరిపోయే ఈ ఎలక్ట్రిక్ స్కూటర్లు పెట్రోల్ ఖర్చును తగ్గించడమే కాకుండా వినియోగదారులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## సప్తమి గౌడపై ఆసక్తికర విషయాలు వైరల్



ఒకే ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ సప్తమి గౌడ ప్రస్తుతం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార' చిత్రంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె, ఆ తర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లారు. సప్తమి గౌడ జూన్ 8, 1996న కర్ణాటక రాజధాని బెంగళూరులో జన్మించారు. ఆమె తండ్రి ఎస్.కె. ఉమేష్ గౌడ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి రిటైర్ కాగా, తల్లి శాంత గౌడ్. విద్యార్హతల విషయానికి వస్తే, ఆమె సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. చదువుకునే రోజుల్లోనే స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించడం ఆమె ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. 'కాంతార' సినిమాతో డీ గ్లామర్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న సప్తమి గౌడ, ఆ చిత్ర విజయంతో ఒక్కసారిగా పాన్ ఇండియా గుర్తింపు పొందారు. ఈ సినిమా అన్ని భాషల్లో విజయవంతం కావడంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వచ్చిన 'ది వ్యాక్సిన్ వార్' చిత్రంలో కూడా నటించి మంచి గుర్తింపు పొందారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నితిన్ హీరోగా వచ్చిన 'తమ్ముడు' సినిమాతో సప్తమి గౌడ కథానాయికగా అడుగుపెట్టారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమెకు టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఆమె ఎక్కువగా కన్నడ చిత్ర పరిశ్రమపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలో మాత్రం సప్తమి గౌడ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉన్నారు. ఒకే ఒక్క సినిమాతో వచ్చిన భారీ క్రేజ్ తర్వాత ఆమె తదుపరి ప్రాజెక్ట్‌లపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. త్వరలో ఆమె నుంచి మరిన్ని కొత్త సినిమాల ప్రకటనలు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## 'బిగ్‌బాస్ తెలుగు 10'పై భారీ ఆసక్తి

తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు ల్యాండ్‌మార్క్ సీజన్‌గా పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మేకర్స్ వరుస ప్రోమోలు, అప్‌డేట్స్‌తో ఆసక్తిని పెంచుతుండగా, కంటెస్టెంట్ల ఎంపికపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ కొనసాగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ సీజన్ ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులకు అవకాశం కల్పించే విధంగా 'అగ్నిపరీక్ష 2' ద్వారా కంటెస్టెంట్లను ఎంపిక చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పదో సీజన్ కావడంతో హౌస్‌లో కొత్త కాన్సెప్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు, విభిన్నమైన టాస్కులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఈ సీజన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు టెలివిజన్ నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లు కంటెస్టెంట్ల జాబితాలో వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ కుటుంబ సభ్యులు, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణి, ప్రభాకర్ లేదా చంద్రహాస్ వంటి పేర్లు సోషల్ మీడియాలో చర్చకు దారి తీస్తున్నాయి. ఇక తాజాగా ఈ జాబితాలో జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర పేరు కూడా బలంగా వినిపిస్తోంది. 'జబర్దస్త్', 'శ్రీదేవి డ్రామా కంపెనీ' వంటి కామెడీ షోల ద్వారా గుర్తింపు పొందిన పవిత్ర, తన సహజమైన హాస్యం, ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఒకప్పుడు బ్యూటీ పార్లర్‌లో పనిచేసిన ఆమె, తన ప్రతిభతో బుల్లితెరపై ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గతంలోనూ ఆమె పేరు బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా వినిపించినప్పటికీ, ఈసారి మాత్రం హౌస్‌లోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బిగ్‌బాస్ టీమ్ ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పవిత్ర నిజంగానే హౌస్‌లోకి అడుగుపెడితే షోకు వినోదం మరింత పెరుగుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో 'బిగ్‌బాస్ తెలుగు 10'పై ఉత్కంఠ రోజురోజుకీ పెరుగుతోంది.



## నిర్మాత గొట్టిముక్కల పద్మారావు మృతి

తెలుగు చలనచిత్ర పరిశ్రమతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సినీ నిర్మాత, రాజకీయ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు (72) ఆదివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్త తెలియగానే కూకట్‌పల్లిలోని నివాసానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, స్థానిక రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు. పద్మారావు మృతి పట్ల సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గొట్టిముక్కల పద్మారావు తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. ఆయన స్థాపించిన 'పద్మప్రియ ఆర్ట్స్' బ్యానర్ ద్వారా విభిన్న కథాంశాలతో పలు విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. సుమన్ హీరోగా తెరకెక్కిన 'కంచు కవచం' వంటి యాక్షన్ చిత్రంతో పాటు, రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో రూపొందిన వినోదాత్మక చిత్రం 'జోకర్'ను కూడా నిర్మించారు. అంతేకాకుండా తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన క్లాసిక్ కామెడీ చిత్రం 'ఏప్రిల్ 1 విడుదల' వంటి విజయవంతమైన సినిమాలను నిర్మించి ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. వైవిధ్యమైన కథలను ప్రోత్సహిస్తూ, కొత్త ఆలోచనలతో సినిమాలను నిర్మించిన పద్మారావు, పరిశ్రమలో అందరితో సాన్నిహిత్యంగా మెలిగే వ్యక్తిగా పేరొందారు. సినిమా రంగంలోనే కాకుండా ప్రజా సేవలోనూ చురుకుగా పాల్గొంటూ సమాజానికి తనవంతు సేవ చేసిన ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని సినీ ప్రముఖులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ అభిమానులు, పరిశ్రమ వర్గాలు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు.





## టాలీవుడ్‌కు సోనాలి బింద్రే రీ ఎంట్రీ సన్నాహాలు

టాలీవుడ్ ప్రేక్షకులకు ఎంతో ఇష్టమైన నటి, 'మురారి' బ్యూటీ సోనాలి బింద్రే సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపై కనిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒకప్పుడు తన సహజమైన నటనతో పాటు ఆకర్షణీయమైన తెర హాజరుతో తెలుగు ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఆమె, ప్రస్తుతం ఒక ప్రతిష్టాత్మక తెలుగు చిత్రంలో కీలక పాత్ర కోసం చర్చల్లో ఉన్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సోనాలి బింద్రే తెలుగులో 'మురారి', 'ఇంద్ర', 'మన్మథుడు' వంటి క్లాసిక్ విజయాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆ తర్వాత వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు దూరమైన ఆమె, ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. ప్రముఖ దర్శకులు, అగ్ర నిర్మాణ సంస్థలు ఆమెను ఒక పవర్‌ఫుల్ పాత్ర కోసం సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ వార్త వెలుగులోకి రావడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. వ్యక్తిగత జీవితంలో సోనాలి బింద్రే ఎదుర్కొన్న అనుభవాలు కూడా ఆమెను మరింత బలమైన వ్యక్తిగా మార్చాయి. 2018లో ఆమెకు స్టేజ్4 క్యాన్సర్ నిర్ధారణ కాగా, ఆ సవాలును ధైర్యంగా ఎదుర్కొని కోలుకోవడం అనేక మందికి స్ఫూర్తిగా నిలిచింది. చికిత్స అనంతరం ఆమె మళ్లీ కెరీర్‌పై దృష్టి పెట్టారు. ఇటీవల ఆమె వెబ్ సిరీస్‌ల ద్వారా మళ్లీ నటనలోకి అడుగుపెట్టారు. 'ది బ్రోకెన్ న్యూస్', అలాగే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన క్రైమ్ థ్రిల్లర్ 'రాఖ్' వంటి ప్రాజెక్టుల్లో తల్లి పాత్రలలో కనిపించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె హిందీ బుల్లితెర కార్యక్రమాల్లో కూడా కనిపిస్తున్నారు. క్యాన్సర్ తర్వాత సోనాలి పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, తనకు మానసికంగా సంతృప్తినిచ్చే, బలమైన పాత్రలనే ఎంచుకుంటున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో ఆమె రీ ఎంట్రీ ఖరారైతే అది ఆమె కెరీర్‌లో మరో కీలక మలుపుగా మారుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## రామ్‌చరణ్‌సుకుమార్ 'RC17' షూటింగ్‌కు ఆలస్యం

టాలీవుడ్‌లో అత్యంత భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటైన గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, స్టార్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ ప్రాజెక్ట్ '=జ17' షూటింగ్ అనుకున్న సమయానికి కాస్త ఆలస్యం కానున్నట్లు సినీ వర్గాల సమాచారం. రామ్‌చరణ్ ప్రస్తుతం నటిస్తున్న 'పెద్ది' సినిమా చిత్రీకరణ సమయంలో ఆయన చేతికి గాయమైన నేపథ్యంలో, ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స సూచించినట్లు తెలుస్తోంది. సర్జరీ అనంతరం దాదాపు రెండు నుంచి మూడు నెలల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో రామ్‌చరణ్ పూర్తిగా కోలుకున్న తర్వాతే '=జ17' సెట్స్‌లో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే దసరా పండుగ సమయానికి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రారంభానికి కొంత గ్యాప్ తప్పదని తెలుస్తోంది. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో హీరో గాయంతో ఏర్పడిన విరామాన్ని దర్శకుడు సుకుమార్ సమర్థంగా వినియోగించుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ గ్యాప్‌లోనే కథా చర్చలు, ప్రీ-ప్రొడక్షన్ పనులు, లొకేషన్ల ఎంపిక, కీలక నటీనటుల ఎంపిక వంటి పనులను వేగంగా పూర్తి చేయాలని మైత్రీ మూవీ మేకర్స్ యూనిట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. సుకుమార్ మార్క్ కథనం, ప్రత్యేకమైన విజువల్ స్టైల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం పీరియాడిక్ డ్రామా లేదా విభిన్న యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటుందనే ప్రచారం ఉంది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా అత్యున్నత స్థాయి సాంకేతిక విలువలతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. రామ్‌చరణ్ పూర్తిగా కోలుకున్న తర్వాత ఈ భారీ ప్రాజెక్ట్ మరింత వేగం పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.




Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com